తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4
సంచిక :
పేజీలు - 8
వెల- రూ 5:00 95
www.prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం 22, సెప్టెంబర్-2023

## తనపై బురదజల్లే రాతలు నేత ఈటెల




Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

# హుస్నాబాద్ బిజెపిలో నాలుగు స్తంభాలాట

- ఆ నలుగురు" ఒకటయ్యేనా...?
- అందరూ ఉద్దండులే కానీ... !
- వారు" ఏకమైతే కాషాయ జెండా ఎగరడం ఖాయం అంటున్న కార్యకర్తలు



(ప్రజామంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి ప్రత్యేక కథనం)

భీమదేవరపల్లి సెప్టెంబర్ 21 (ప్రజామంటలు) : హుస్నాబాద్ అసెంబ్లీ అభ్యర్థిగా కమలం పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు అభ్యర్థిని ప్రకటించలేదు. ప్రస్తుతం ఆ పార్టీలో "నాలుగు స్తంభాలాట" కొనసాగుతుంది. ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీకి కమలం పక్షాన గట్టి పోటీ ఇచ్చే సమర్థవంతమైన వ్యక్తిని బరిలోకి దించడానికి అధిష్టానం కసరత్తు చేస్తుందని సమాచారం.

### సామాజిక సేవతో క్యాడర్ ను సమయాత్తం

హుస్నాబాద్ నియోజకవర్గంలో కాషాయం జండా ఎగరవేస్తామని, గత కొంతకాలంగా ఓదార్పు యాత్రలు, బియ్యం పంపిణీ, యువతతో నిరంతర ఆటల పోటీలు, ఆర్థిక సహాయాలు నిర్వహిస్తూ పలువురిని ఆకట్టుకునే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### టికెట్ కోసం ఎవరి ప్రయత్నాల్లో వారే

టికెట్ నాకంటే నాకే దక్కుతుందనే ఆశాభావంతో ముందుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమాల ముందు వరుసలో జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, కర్ణకంటి మంజులారెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఉన్నారు. కాగా పార్టీ ఆదేశానుసారం పార్టీకి సేవలు అందిస్తున్న కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సైతం టికెట్ తనకే వస్తుందని ఆశాభావంతో ముందు కెళుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వొడితల సతీష్ కుమార్ మిగతా 2లో..

## కాంగ్రెస్ తొలి జాబితాలో 50 గెలుపు గుర్రాలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్21 : గెలుపే ప్రధానంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, మొదటి దశలో 50-55 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన ఉంటుందని సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ఢిల్లీలోని కాంగ్రెస్ వార్ రూమ్ లో తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ భేటీ జరిగింది. అనంతరం మధుయాష్కీతో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశం మధ్యలో ఆగిందని, అయినప్పటికీ అభ్యర్థుల ఎంపికపై చాలా వరకు చర్చ జరిగిందని ఆయన చెప్పారు. 'టికెట్ల కేటాయింపులో సర్వేలు, పార్టీతో అభ్యర్థులకు ఉన్న అనుబంధం రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటాం. కాంగ్రెస్ సిద్ధాంతాలతో నడిచే వారిని వదులుకోం. అదే సమయంలో గెలిచే సత్తా ఉంటే కొత్త వారికి అవకాశం ఇస్తాం. టికెట్ రాని వారికి ఏదో విధంగా సర్దుబాటు చేస్తాం' అని భట్టి పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి మొదలుపెట్టి, రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించామని వెల్లడించారు. యాత్ర ఎప్పుడు ప్రారంభించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. అందులో తాను, రేవంత్, ఇతర సీనియర్ నేతలు పాల్గొంటారని చెప్పారు. లెఫ్ట్ పార్టీలతో పొత్తు అంశం హైకమాండ్ చూసుకుంటుందన్నారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతుల్యం పాటిస్తామని మధుయాష్కీ అన్నారు. కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలో భేటీలో మాణిక్ రావ్ ఠాక్రే, జిగ్నేష్ మేవానీ, రేవంత్, భట్టి విక్రమార్క, మధుయాష్కీ గౌడ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు మొదలైన సమావేశం.. దాదాపు 45 నిమిషాల మిగతా 2లో..

## నాలుగు బ్యాంకులకు ఆర్‌బీఐ భారీ జరిమానా




హైదరాబాద్-ప్రజామంటలు(సెప్టెంబర్-21) : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి కొరడా ఝుళి పించింది. తాజాగా నిబంధలను బేఖాతరు చేసిన మరో నాలుగు కోఆపరేటివ్ బ్యాంకులకు షాకిచ్చింది. భారీ పెనాల్టీ విధించింది. 31 మార్చి 2022 నాటికి వ్యక్తిగత విచారణ సమయంలో అన్ని బ్యాంకుల ప్రత్యుత్తరాలు , మౌఖిక సమర్పణలను పరిశీలించిన తర్వాత, ఆర్‌బీఐ ఆదేశాలను పాటించలేదన్న ఆరోపణలు రుజువు కావడంతో ద్రవ్య పెనాల్టీ విధించబడుతుందని నిర్ధారణకు వచ్చినట్లు ప్రకటించింది. రెగ్యులేటరీ చట్టాలను ఉల్లంఘించారని పేర్కొంటూ నాలుగు సహకార బ్యాంకులపై ద్రవ్య పెనాల్టీలను విధించింది. వీటిలో మూడు బ్యాంకులు గుజరాత్‌కు చెందినవి కాగా, మరొకటి మహారాష్ట్రకు చెందింది. గుజరాత్‌కు చెందిన లాల్‌బాగ్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌పై అత్యధికంగా రూ.5 లక్షల జరిమానా విధించింది. ఇతర బ్యాంకుల డిపాజిట్ల ప్లేస్‌మెంట్ల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన మార్గదర్శకాలను ఉల్లంఘించినట్టు గుర్తించి గుజరాత్, వడోదరలోని లాల్‌బాగ్ కోఆపరేటివ్ బ్యాంకుకు రూ. 5 లక్షల మిగతా 2లో..

## స్వంత ఏజెండాతో ఉన్నపరువు తీసుకొంటున్న బిజేపి నాయకులు

# బిజేపిలోని అంతర్గతపోరు భారసకే నష్టమా ?



మిగతా 2లో..

- బిజేపి వల్ల కాంగ్రెస్ కన్నా భారాస కే ఎక్కువ నష్టమా ?
- గ్రూప్ లు- రహస్య సమావేశాలతో క్యాడర్ గందరగోళం
- ఎవరు కోవర్ట్ -ఎవరు నిజమైన నాయకులో తెలియని అయోమయం

(సిహెచ్ వి ప్రభాకర్ రావు, సీనియర్ జర్నలిస్ట్)

హైదరాబాద్-ప్రజామంటలు(సెప్టెంబర్-21) : తెలంగాణలో అధికారంలోకి వస్తామని గత నాలుగేళ్లుగా ఎంతో బలంగా నమ్మిన బిజేపి, గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిమాణాలతో, కనీసం గౌరవప్రదమైన సంఖ్యలో నైనా, ఎమ్మెల్యేలను గెలిపించుకోగలుగుతామా అని పార్టీ నాయకుల్లో అంతర్మధనం పారంభమైనట్లుగా తెలుస్తుంది. పార్టీలో చెరికలు లేకపోగా, భారాస కే ఎసరుపెట్టే దిశలో బిజేపి ప్రయాణం కొనసాగుతుందేమో అనే భయాన్ని కూడా ప్రచారం చేస్తున్నవారు లేకపోలేదు. రాష్ట్ర స్థాయి నాయకులలో ఉన్న అసమ్మతి, ఒకరిపై ఒకరికి వ్యతిరేకత పార్టీని నట్టేట ముంచుతుందేమోనని కారాయకర్తలు బెంభేలుపడుతున్నారు. పార్టీలో కొత్తగా వచ్చిన వారు, ఆర్ ఎస్ ఎస్ నేపథ్యం ఉన్న వారితో పోత్తు కూదరకే ఈ గోడవలనే వాదాన ఉంది. రాష్ట్రంలో బిజేపి పరిస్థితిపై

ప్రజామంటలు ప్రత్యేక కథనం

## ప్రజానాడి



## ఆర్టీసీని కాపాడేందుకే సర్కార్‌లో విలీనం పువ్వాడ

2లో..

## హైదరాబాద్ రజినీలకు అర్థమైంది..

### గజినీలకు అర్థం కాలేదు : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్,సెప్టెంబర్21 : గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి హైదరాబాద్‌లో తాగునీటి కొరతను సీఎం కేసీఆర్ తీర్చారని మంత్రి హరీశ్‌రావు చేశారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఈ పని చేయలేకపోయాయని అన్నారు. పేదలందరికీ ఉచితంగా మంచినీటిని బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని కొల్లూరులో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మిగతా 2లో..

## పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే సిఎం ధ్యేయం

### : తలసాని శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్,సెప్టెంబర్21 : పేదలు గొప్పగా బతకాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకు అందజేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లిలో వెయ్యి మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల కోసం ఆలోచించే వ్యక్తి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటం మన అదృష్టం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వమే అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఉచితంగా మిగతా 2లో..

# రాజ్యసభ ముందుకు మహిళా బిల్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్21 : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లు గురువారం ఉదయం రాజ్యసభ ముందుకు చేరింది. సభ ప్రారంభంకాగానే కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మహిళా బిల్లును సభలో ప్రవేశపెట్టారు. దీనిపై సభలో చర్చ చేపట్టారు. చర్చ అనంతరం బిల్లుపై ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే, ఈ బిల్లుకు విపక్ష సభ్యులు మద్దతు తెలుపుతుండటంతో ఎగువ సభలో బిల్లు ఆమోదం పొందడం లాంఛనంగా కనిపిస్తోంది. ఉభయ సభల ఆమోదం అనంతరం రాష్ట్రపతి ముద్రతో బిల్లు చట్టరూపం దాల్చనుంది. అయితే, నియోజకవర్గాల పునర్విభజన పూర్తైన తర్వాతే ఈ బిల్లు అమల్లోకి రానున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది.

# కెనడా లో మరో ఖలిస్థాని ఉగ్రవాది దారుణ హత్య

న్యూఢిల్లీ,సెప్టెంబర్21 : కెనడా లో మరో ఖలిస్థాని ఉగ్రవాది దారుణ హత్యకు గురయ్యాడు. ఖలిస్థాన్ ఉగ్రవాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష దాలా అనుచరుడైన సుఖ్దూల్ సింగ్ కెనడాలోని విన్నిపెగ్ పట్టణంలో హత్యకు గురయ్యాడు. బుధవారం రాత్రి రెండు గ్రూపుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో అతడు మరణించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఏ-కేటగిరీ గ్యాంగ్ స్టర్ అయిన సుఖ్దూల్ సింగ్ పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన వ్యక్తి. 2017లో నకిలీ పత్రాలపై భారత్ నుంచి కెనడా పారిపోయాడు. అప్పటి నుంచి కెనడాలోనే ఉంటూ ఖలిస్థాన్ అనుకూల కార్యకలాపాలకు పాల్పుడుతున్నాడు. అతను టెర్రరిస్ట్ అర్షదీప్ దల్లాకు అత్యంత సన్నిహితుడు. అదేవిధంగా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్‌తో అతడికి సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ తేల్చింది. కెనడాలో ఖలిస్థాన్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్న 43 మంది గ్యాంగ్‌స్టర్లలో ఒకడని పేర్కొంది. ఈ ఏడాది జూన్ లో ఖలిస్థాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురైన విషయం తెలిసిందే. దుండగులు నిజ్జర్‌ను అతిదారుణంగా కాల్చి చంపారు. అయితే, అతడి హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. ఇది రెండు దేశాల మధ్య దౌత్య యుద్ధానికి దారితీసింది. ఇదే సమయంలో మరో ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాది హత్యకు గురికావడం ఇప్పుడు సంచలన రేకిస్తోంది.

# ఎలక్షన్ స్క్రీనింగ్ కమిటీలోకి కోమటిరెడ్డి, మధుయాష్కీ





హైదరాబాద్-ప్రజామంటలు(సెప్టెంబర్-21) : కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలోకి మరో ఇద్దరు సీనియర్ నేతలకు స్థానం దక్కింది. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్‌లకు చోటు కల్పించారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. ÷-రస్తుతం ఎంపీ మురళీధరన్ అధ్యక్షతన సభ్యులుగా గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని, బాబా సిద్ధికి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. తాజాగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మధు యాష్కి లకు అందులో స్థానం లభించింది.

# పదవీత్యాగం చేసిన కొండా లక్ష్మణ్

## నివాళి అర్పించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జనగామ,సెప్టెంర్21 : తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని గడ్డి పోచలా వదిలేసిన నిబద్ధత గల రాజకీయవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గురువారం పాలకుర్తిలోని ప్రధాన కూడలిలో బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యోద్యమంలో, నిజాం వ్యతిరేక పోరాటంలోనూ చురుకుగా పాల్గొన్న యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. నిఖార్సయిన తెలంగాణ వాది. 97 యేండ్ల వయస్సులో కూడా తెలంగాణ కోసం పరితపించి మలి దశ ఉద్యమాలలో పాల్గొన్నారు. తన జల దృశ్యాన్ని ఉద్యమాలకు అడ్డాగా మార్చిన త్యాగశీలి బాపూజీ అని ప్రశంసించారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి అనేక సేవలు చేశారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి వేములకు మద్దతుగా గ్రామాల్లో తీర్మానాలు

నిజామాబాద్,సెప్టెంర్21 : రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి రోజురోజుకి మద్దతుల పెరుగుతున్నది. బీఆర్ఎస్ వెంటే మేమంటూ సబ్బండ వర్ణాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు ప్రకటిస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తున్నది. అన్ని విధాల అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికే మా మద్దతు అంటూ ఆయా మండలాల్లో గ్రామాల్లోని పలు కుల సంఘాలు స్వచ్ఛందంగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయి. తాజాగా భీంగల్ మండలం పురానిపేట కుర్మ సంఘం, మెండోర గ్రామ మాల సంఘం సభ్యులు, మోర్తాడ్ మండలం పాలెం గ్రామ ముదిరాజ్ సంఘాల వారు బీఆర్ఎస్ పార్టీ, వేముల ప్రశాంత్ రెడ్డికి ఎన్నికల్లో తన వెంట ఉంటామని ఏకగ్రీవ తీర్మానం చేసిన పత్రాలను ఇచ్చి తమ మద్దతు తెలియజేశారు.

# క్రీడలు జీవితంలో భాగం కావాలి

## చదువుతో పాటు వీటిని అలవర్చుకోవాలి

## బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్,సెప్టెంర్21 : విద్యార్థులకు చదువుతో పాటు రోజు వారి జీవితంలో క్రీడలు కూడా భాగం కావాలని..శారీరకంగా బాగుంటేనే పిల్లలు మానసికంగా రాణిస్తారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపులే పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ వరకు విద్యను ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాక ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 19 పాఠశాలలు మాత్రమే ఉంటే..నేడు స్వరాష్ట్రంలో 337 పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఉన్న కళాశాలలో పాటు మరో 33 డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశం మొత్తం నేడు తెలంగాణ వైపు చూస్తోందని, కష్టపడి చదివి తల్లి దండ్రుల కలలు నిజం చేయాలని, రాష్ట్రానికి తల్లిదండ్రులకు గొప్ప పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జిల్లా కలెక్టర్ గోపి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎం.జే.పీ స్కూల్స్ డిప్యూటీ కమిషనర్ తిరుపతి, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, ప్రిన్సిపల్ విమల తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌పై కెనడా ప్రధాని తీవ్ర వ్యతిరేకత

న్యూఢిల్లీ,సెప్టెంబర్21 : భారత్‌పై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఖలిస్థాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందంటూ ఇటీవలే ట్రూడో తీవ్రమైన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ట్రూడో ఆరోపణలతో భారత్-కెనడా మధ్య దౌత్య యుద్ధానికి దారితీసింది. అయితే, భారత్ విషయంలో ట్రూడో ముందు నుంచే వ్యతిరేక భావజాలంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఇటీవలే న్యూ ఢిల్లీ వేదికగా జరిగిన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జరిగిన ఓ సంఘటన తాజా పరిస్థితులకు బలం చేకూరుస్తోంది. భారత్ నాయకత్వం వహించిన ప్రతిష్ఠాత్మక జీ20 సదస్సు ఈ నెల 9-10 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ సదస్సుకు హాజరైన ప్రపంచ దేశాధినేతలకు కేంద్రం గొప్ప ఆతిథ్యం ఇచ్చింది. అతిథుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్లోబల్ లీడర్‌కు పూర్తి భద్రతా ప్రొటోకాల్‌లతో ప్రెసిడెన్షియల్ సూట్‌తో కూడిన వీవీఐపీ హోటళ్లలో బస ఏర్పాటు చేసింది. ట్రూడోకు కూడా ఢిల్లీలోని లలిత్ హోటల్‌లో ప్రత్యేకంగా రూపొందించిన ప్రెసిడెన్షియల్ సూట్‌లో బస ఏర్పాటు కల్పించింది. అయితే,



అందులో ఉండేందుకు కెనడా ప్రధాని నిరాకరించినట్లు కేంద్ర వర్గాలు తాజాగా వెల్లడించాయి. తనకోసం బుక్ చేసిన ప్రెసిడెన్షియల్ సూట్‌లో ట్రూడో బస చేయలేదని తెలిపాయి. బదులుగా భారత్‌లో ఉన్నంత సేపూ ఆయన అదే హోటల్‌లోని ఓ సాధారణ గదిలో బస చేసినట్లు పేర్కొన్నాయి. మరోవైపు జీ20 సమ్మిట్ సందర్భంగా ట్రూడోకు ఎన్నో షాకులు ఎదురయ్యాయి. ముఖ్యంగా సదస్సులో ఆయన వ్యవహార శైలి ముందు నుంచీ అంటీముట్టనట్టే ఉంది. సదస్సు తొలిరోజు రాష్ట్రపతి ఏర్పాటు చేసిన విందుకు కూడా ఆయన హాజరు కాలేదు. దీనికి కారణం చెప్పేందుకు కూడా కెనడా ప్రధానమంత్రి కార్యాలయం నిరాకరించింది. ప్రపంచ దేశాధినేతలు రాజ్‌ఘాట్‌లో నివాళులు అర్పించే సమయంలోనూ ట్రూడో ఎవరితోనూ పెద్దగా కలవలేదు. దీంతో ప్రధాని మోదీ ఆయన్ను చేయి పట్టుకొని అక్కడి విశేషాలను వివరించేందుకు ప్రయత్నించినా.. ట్రూడో సున్నితంగా చేయి వెనక్కి తీసుకున్నారు. ఇక జీ20 చివరి రోజు మోదీతో ద్వైపాక్షిత సమావేశం తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. ఈ భేటీలో మోదీ నేరుగా ట్రూడో వద్దే భారత్ వ్యతిరేక శక్తులు కెనడాలో ఆశ్రయం పొందడాన్ని ప్రస్తావించారు. ఇది కెనడాకు కూడా ముప్పుగా మారుతుందని హెచ్చరించారు కూడా. ఇక భారత్ పర్యటన ముగించుకొని కెనడా బయలు దేరే చివరి క్షణంలో ట్రూడో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో మరో రెండు రోజులు ట్రూడో సహా ఆ దేశ ప్రతినిధులు ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. వారు తిరిగి కెనడా వెళ్లేందుకు వీలుగా భారత్ తన 'ఎయిర్ ఇండియా వన్' విమానాన్ని వినియోగించుకోవాలని సూచించింది. అయితే, భారత్ సాయాన్ని కెనడా తిరస్కరించింది. చివరికి సుమారు 36 గంటల నిరీక్షణ తర్వాత తిరిగి కెనడా బయలుదేరి వెళ్లారు.

# చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై టిడిపి ఆందోళన

- స్పీకర్ పోడియం వద్ద నినాదాలు
- సభ్యుల తీరుపై స్పీకర్ అసహనం
- ప్లకార్డులతో సభ్యుల నినాదాలు
- టిడిపి తీరుపై మండిపడ్డ అధికారపక్షం
- ఇద్దరు సభ్యులను సమావేశాల వరకు సస్పెన్షన్
- 15మందికి ఒకరోజు సస్పెనషన్ వేటు



అమరావతి,సెప్టెంబర్21 : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే వాడీవేడీగా మొదలైంది. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని టీడీపీ పట్టుబట్టింది. దీనిపై అధికార పక్షం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చెప్పారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ టీడీపీ సభ్యులను రెచ్చగొట్టారు. దీంతో అటు నుంచి కూడా గట్టి రియాక్షన్ వచ్చింది. చంద్రబాబు అక్రమ అరెస్టులపై చర్చ జరపాలని టీడీపీ పట్టుబట్టారు. స్పీకర్ పోడియంను చట్టుముట్టారు. ఈ గందరగోళం మధ్యే ప్రశ్నోత్తరాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. టీడీపీ సభ్యులు మాత్రం వెనక్కి తగ్గలేదు. స్పీకర్ పోడియం వద్దే నినాదాలు చేస్తూ నిల్చున్నారు. టీడీపీ సభ్యులకు వైసీపీ ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా మద్దతు ప్రకటించారు. స్పీకర్ వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. టీడీపీ సభ్యుల తీరుపై మొదట మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు కోరుతున్నట్టు అన్నింటిపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అయితే ప్రోపర్ ఫార్మెట్‌లో వస్తే అన్నింటిపై డిస్కషన్ చేద్దాం అన్నారు. అయినా టీడీపీ సభ్యులు వెనక్కి తగ్గలేదు. ఇంతలో మంత్రి అంబటి రాంబాబు లేచి మాట్లాడటంతో పరిస్థితి ఒక్కసారిగా హీట్ ఎక్కింది. టీడీపీ సభ్యులను ఉద్దేశిస్తూ మాట్లాడిన అంబటి రాంబాబు... అక్కడ జరుగుతున్న వాటిపై రన్నింగ్ కామెంట్రీ చెప్పారు. స్పీకర్‌పై దాడి చేయడానికి కూడా కొందరు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలా వారిని నిలువరించకపోతే రెచ్చగొట్టే ధోరణితో వాళ్లు ఉంటే తమ సభ్యులు కూడా రెచ్చిపోతారంటూ కామెంట్ చేశారు. తమను రెచ్చగొడుతున్నారని... తమ దగ్గరా ఓవరాక్షన్ చేసే వ్యక్తులున్నారు అని అంబటి అన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే వారిదే బాధ్యత అని హెచ్చరించారు. అక్రమ కేసులు ఎత్తివేయమని ఇక్కడ కాదు అడగాల్సిందని కోర్టుల్లో వాదించాలన్నారు. ఇలా ఆయన కామెంట్ చేస్తూనే బాలకృష్ణ ప్రస్తావన తీసుకొచ్చారు. బాలకృష్ణ తమ వైపు చూసి మీసాలు తిప్పారని... అలాంటి కార్యక్రమాలు సినిమాల్లో పెట్టుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. మీసాలు తిప్పడం కాదని దమ్ముంటే రా అంటూ బాలకృష్ణకు అంబటి సవాల్ చేశారు. రా రా చూసుకుందాం అంటూ గట్టిగా మాట్లాడారు. దీంతో సభలో ఒక్కసారిగా అరుపులు కేకలతో దద్దరిల్లి పోయింది. అంబటి రాంబాబు అలా మాట్లాడుతుండగానే వెనుకే ఉన్న బియ్యం మధుసూదన్ రెడ్డి లేచి టీడీపీ సభ్యుల వైపు వెళ్లడం కనిపించింది. బియ్యం మధుసూదన్ రెడ్డి వెళ్తూ వెళ్తూ టీడీపీ లీడర్లను రెచ్చగొట్టేలా వారి ఎదురుగా తొడకొట్టినట్టు తెలుస్తోంది. ఇరు వర్గాల రెచ్చగొట్టే చర్యల కారణంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో స్పీకర్ లేచి రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి సభను వాయిదా వేసి వెళ్లిపోయారు. అంతకు ముందు టీడీపీ సభ్యులు పాదయాత్రగా సభకు వచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేశారని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. షెల్ కంపెనీల సృష్టికర్త జగనే అంటూ ప్లకార్డును ఉండవల్లి శ్రీదేవి పట్టుకున్నారు. చంద్రబాబుపై కక్ష- యువత భవితకు శిక్ష అంటూ టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు. అదే సమయంలో ఆందోళన సమయంలో అసెంబ్లీ సొత్తును ధ్వంసం చేసిన సభ్యులు వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను సమావేశాలు పూర్తి అయ్యే వరకు సస్పెండ్ చేస్తున్నట్టు చెప్పారు. అంతేకాకుండా ధ్వంసమైన వస్తువుల డబ్బులను వారి నుంచే రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఇద్దరిపై చర్యలు తీసుకోవడంపై టీడీపీ సభ్యులు వ్యతిరేకించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతలో సభా వ్యవహారాల మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి లేచి... టీడీపీ సభ్యుల తీరును తప్పుపట్టారు. మిగతా వారి ప్రవర్తన సరిగా లేదని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సూచించారు. వెంటనే స్పీకర్ కలుగుజేసుకొని పయ్యావుల కేశవ్‌ను కూడా సమావేశాలు పూర్తి అయ్యేవరకు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అనుమతి లేకుండా సభా వ్యవరాహాలను సెల్‌ఫోన్‌లో షూట్ చేస్తున్నారని అధికార పార్టీ సభ్యులు అరవడంతో స్పీకర్ చర్యలు తీసుకున్నారు. సభను ఆర్డర్‌లోకి తీసుకునేందుకు మిగతా 15 మంది సభ్యులను ఒకరోజుపాటు సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. సస్పెండ్ చేసినప్పటికీ టీడీపీ సభ్యులు బయటకు వెళ్లేందుకు నిరాకరించారు. ప్రభుత్వానికి, స్పీకర్‌కు, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చంద్రబాబుపై పెట్టిన కేసులు విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలా గందరగోళం నడుస్తున్న టైంలో స్పీకర్ సభను టీ బ్రేక్ కోసం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

# అసెంబ్లీలో టిడిపి సభ్యుల తీరు అభ్యంతరకరం

- అసెంబ్లీలో టిడిపి సభ్యుల తీరు అభ్యంతరకరం
- సత్యహరిశ్చంద్రుడిలా చంద్రబాబు తీరు
- ఎన్టీఆర్‌పై చెప్పులు వెసినప్పడు బాలకృష్ణ పౌరుషం ఏదీ
- టిడిపి ఎమ్మెల్యేల తీరుపై మండిపడ్డ వైకాపా సభ్యులు

అమరావతి,సెప్టెంబర్21 : చంద్రబాబు నాయుడు అరెస్ట్‌పై అసెంబ్లీలో ప్రతిపక్ష టీడీపీ సభ్యులు వ్యవహరించిన తీరును వైఎస్సార్‌సీపీ తీవ్ర స్థాయిలో ఖండించింది. రాజమండ్రి జైల్లో కూర్చుని చంద్రబాబు తాను సత్యహరిశ్చంద్రుడినని బిల్డప్ ఇస్తున్నాడంటూ ఏపీ ఎమ్మెల్సీ పోతుల సునీత ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం మీడి యా పాయింట్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్ర బాబు స్కిల్ స్కామ్ అవినీతిలో కూరుకుపోయారు. రాజ మండ్రి జైల్లో కూర్చుని చంద్రబాబు నేను సత్యహరిశ్చంద్రుడినని బిల్డప్ ఇస్తున్నారు. కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం బాబు నైజం. స్కిల్ డెవలప్ మెంట్ పేరుతో యువతను చంద్రబాబు దోచుకు న్నారు. అవినీతి చేయలేదని సోషల్ మీడియాలో చంద్రబాబు ప్రచారం చేయించుకుంటున్నారని అన్నారు. సభలో హిందూ పురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీరుపైనా ఆమె అభ్యం తరం వ్యక్తం చేశారు. సభలో బాలకృష్ణ తీరు చాలా అభ్యంతర కరంగా ఉంది. ఎమ్మెల్యేగా ఏనాడైనా బాలకృష్ణ ప్రజల సమ స్యల పై చర్చించాడా?. కక్ష సాధింపుగానే చేయాల ంటే.. ఈ నాలుగేళ్లలో ఎప్పుడో చంద్రబాబును అరెస్ట్ అయ్యేవా ళ్లు కదా. మీ నాన్న దివంగత ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపో టు పొడిచినప్పుడు నీ పౌరుషం ఏమైంది?.. మీ నాన్న పై చెప్పులు వేయించినపుడు ఎక్కడికి పోయింది పౌరుషం అంటూ బాలకృష్ణకు చురకలంటించారు. టీడీపీ నేతలు రచ్చకోసమే అసెంబ్లీకి వస్తున్నారు. ఏదో ఒక కారణంతో సభ నుంచి టీడీపీ నేతలు పారిపోతున్నారు. టీడీపీ నేతలు చర్చకు మాత్రమే సభకు రావాలి కానీ..రచ్చ కోసం మాత్రం వద్దు. టీడీపీ నేతలకు ఇదే నా సవాల్. రేపు సభలో స్కిల్ డెవలప్ మెంట్ పైన చర్చిస్తు న్నా ం. 26 న ఫైబర్ నెట్, 27 ఇన్నర్ రింగ్ రోడ్డు పై చర్చ ఉంది. దమ్ము ధైర్యం ఉంటే టీడీపీ నేతలు చర్చకు రావాలి. సభలో ఈ రోజు బాలకృష్ణ నిజమైన సైకోలా కనిపించాడని ప్రభుత్వ విప్, కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సభలో టీడీపీ నేతలు చాలా దారుణంగా వ్యవహరించారు. స్పీకర్ ఛైర్ కు విలువ ఇవ్వకు ండా సభాపతి పట్ల అమర్యాదగా నడుచుకున్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీ పక్షాన చేరి ఓవరాక్షన్ చేశాడు. చంద్రబాబు ప్రజాధనం ఏవిధంగా లూటీ చేశారో కోర్టుకు అందించాం. ఢిల్లీ నుంచి వచ్చిన లా యర్ వాదించినా కేసులో ఆధారాలున్నాయి కాబట్టే న్యాయ మూర్తి రిమాండ్ విధించారు. బాలకృష్ణ తొడలు కొడుతూ, మీ సాలు తిప్పుతూ రెచ్చగొట్టేలా వ్యవహరించాడు. సినిమాల్లో మా ది రిగా ప్రవర్తించడం దురదృష్టకరం. చంద్రబాబు అరెస్ట్ తర్వా త ప్రజాస్పందన వస్తుందని ఊహించి భంగపడ్డారు. ప్రజల నుంచిస్పందనరాక పోవడంతో పవన్ కళ్యాణ్ ను తెచ్చుకున్నారు. సభలో ప్రజల హక్కులను కాలరాసేలా టీడీపీ నేతలు వ్యవహరించారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నా రు. సస్పెన్షన్ తర్వాత కూడా టీడీపీ నేతలు సభా మర్యాదలను పాటించలేదు. పయ్యా వుల కేశవులు సెల్ ఫోన్ తో చిత్రీరిం చాలని చూశారు. సభ నుంచి బయటికి వచ్చి ప్రజలకు వేరే విధమైన సంకేతాలు ఇవ్వాలన్నదే వారి ప్రయత్నం. టీడీపీ నేత లు మీసాలు తిప్పినా ..తొడలు కొట్టినా జనం నమ్మే పరిస్థితి లేదు. చర్చకు రమ్మని కోరితే వచ్చేందుకు టీడీపీ నేతలకు ధైర్యం లేదు. చర్చించేం దుకు టీడీపీ నేతల దగ్గర విషయం లేదు. అందుకే సభలో అల్లరి చేస్ బయటికి పోవాలనే గందరగోళం సృష్టించారు.

# తనపై బురదజల్లే రాతలు

## హామీల అమలలుఓ కెసిఆర్ విఫలం

## కాంగ్రెస్ హామీలు ఆచరణ సాధ్యం కావు

## మీడియాతో మాజీమంత్రి, బిజెపి నేత ఈటెల



హైదరాబాద్,సెప్టెంర్21 : తనకు ఎవరూ శత్రువులు లేరని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై కొంత మంది చెడు రాతలు రాస్తున్నారని, నిరాధారంగా అలా రాయడం ఎంతో బాధించిందని ఈటల అన్నారు. గత ఎన్నికల్లో అధికారం కోసం సీఎం కేసీఆర్ హామీలు గుప్పించారని, ఇప్పుడు హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్‌కు ప్రజలు గుర్తొస్తారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఓట్ల కోసం హామీలు ఇచ్చి ఆ తర్వాత మర్చిపోయారని ఆయన విమర్శించారు. దళితుల సంక్షేమం కోసం దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టామని చెప్పుకునే కేసీఆర్ ఆ పథకాన్ని పూర్తిగా ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. రాష్ట్ర యువతను బీఆర్ఎస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఈటెల అన్నారు. యువతను మభ్యపెట్టేలా నిరుద్యోగ భృతి ప్రకటించిందని, ఇప్పుడు భృతి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వైన్స్ టెండర్ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యాపారస్తుల జేబులు గుల్ల చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు చేయడం లేదని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ విఫలమయ్యారని మండిపడ్డారు. 57ఏళ్లకే పెన్షన్లు, వితంతు పెన్షన్లు కూడా ఇస్తానని చెప్పారని, కానీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. డబ్బు లేకనే ఈ పథకాలను అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రం దివాళా తీసిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలవుతాయా లేదా ఆలోచించుకోవాలన్నారు. గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని ఈటల అన్నారు. ఆ అనుభవంతో చెబుతున్నానని కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు ఆ పథకాలు ప్రకటించొద్దంటూ హితవు పలికారు. ఏ మహిళలకు రెండు వేల రూపాయలు ఇస్తారో, ఎంత మందికి ఇస్తారో కాంగ్రెస్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు హామీలను ఎలా అమలు చేస్తారో కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేయాలన్నారు. కర్ణాటకలో ఎన్నికలల్లో గెలిచేందుకు గ్యారెంటీ పథకాలు హామీలు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేశాక చేతులేత్తేశారని విమర్శించారు. రాష్ట్రంలో వచ్చే ఆదాయంపై బీజేపీకి మంచి అవగాహన ఉందన్నారు. అణగారిన వర్గాలకు ఎలా సంక్షేమ పథకాలు అమలు చేయాలో బీజేపీ అధిష్ఠానం అధ్యయనం చేసిన తర్వాత పథకాలు ప్రకటిస్తామని ఈటల రాజేంద్ర అన్నారు. అత్యుత్తమ పథకాలతో అతి త్వరలోనే మంచి మేనిఫెస్టోను ప్రకటిస్తామని చెప్పారు. జాతీయ నాయకత్వంతో మాట్లాడు తున్నామని ప్రజలకు మంచి చేసే పథకాలు ప్రకటిస్తామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న లీడర్ నేనేనని, రాష్ట్రంలో గుర్తుపట్టని వారు ఎవరూ లేరని అన్నారు. హుజూరాబాద్ ఉపఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు యత్నించిందన్నారు. తనను ఓడించేందుకు కేసీఆర్ ప్రయత్నం చేశారని రూ. 600 కోట్లు ఖర్చు చేశారని, కానీ ప్రజలు తనవైపు నిలబడ్డారని, గెలిపించారని అన్నారు. హుజూరాబాద్ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తానని కొంతమంది భావిస్తున్నారని, అలాంటిది ఏమీ లేదన్నారు. రైతు బంధు పథకం చిన్న రైతులకు అమలు చేయాలని తాను మంత్రిగా ఉన్నప్పుడే చెప్పినట్లు తెలిపారు. లాబీయింగ్‌తోనే కొంతమంది బతుకుతుంటారని ఈటల రాజేందర్ విమర్శలు చేశారు.

# మహిళలూ..మరో ఐదేళ్లు ఆగాల్సిందే

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అంశం తమ పార్టీకి రాజకీయ ఎజెండా కాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభ సాక్షిగా పేర్కొన్నా..బిజెపి వ్యవహారం అంతా రాజకీయం దిశగానే సాగిందని చెప్పాలి. మహిళా బిల్లు ఇప్పట్లో అమలు కాదు. దానిని పార్లమెంట్ నుంచి గట్టెక్కించి..మహిళల దృష్టిలో శభాష్ అనిపించుకోవాలన్న తపన తప్ప చిత్తశుద్ధి మాత్రం కనిపించలేదు. నిజంగానే చిత్తశుద్ధి ఉంటే.. రాజకీయం చేయాల్సిన అసవరం లేకుంటే డీ లిమిటేషన్‌తో లింకు పెట్టేవారు కాదు. ఖచ్చితంగా ఇదో ఎన్నికల డ్రామా గానే చూడాలి. వారికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే ఎన్నికల నుంచే అమలయ్యేలా మహిళా బిల్లు రూపొందేది. నారీ శక్తి వందన్ అధినియమ్ 2023 బిల్లుపై లోక్‌సభలో ప్రసంగించిన సందర్భంగా అమిత్ షా ఆదర్శాలు వల్లించారు. మహిళా సాధికారత అనేది కొన్ని పార్టీలకు రాజకీయాంశమని అన్నారు. 2024 ఎన్నికలు ముగిసిన వెంటనే, జనగణన, డీలిమిటేషన్ ప్రక్రియ మొదలుపెడతామని అమిత్ షా స్పష్టం చేశారు. అంటే 2024లో తామే అధికారంలోకి వస్తున్నామని చెప్పకనే చెప్పారు. మీరంతా ఓటేసి మమ్మలను గెలిపిస్తే.. ఈ బిల్లు చట్టంగా మారితే.. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవు తాయని సంకేతం ఇచ్చారు. ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందినప్పటికీ.. 2027 తర్వాత రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని కేంద్రం చెప్పకనే చెప్పింది. బిల్లు ఆమోదించే సందర్భంలో విపక్షాలు కూడా గట్టిగా వెంటనే అమల్లోకి రావాలని పట్టుబట్టలేదు. ఎక్కడ తమ సీట్లకు ఎసరు వస్తుందో అన్న భయం అందరిలోనూ ఉంది. అందుకే మహిళల పట్ల వీరంతా దొంగ ప్రేమను ఒలకబోసారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రొటేషన్ పక్రియలో రిజర్వు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొనడం ద్వారా బిజెపి తన రాజకీయ చతురతను చాటుకుంది. మహిళలకు రిజర్వేషన్ల కల్పనతో ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరపడనుందన్న సంతోషం కన్నా మరో ఐదేళ్ల కాలం వేచి చూడక తప్పదని మహిళలంతా గుర్తించాలి. ఇల్లలకగానే పండగ కాదన్న చందంగా మహిళా బిల్లును చట్టంగా రూపొందించారు. మహిళా సాధికారత అనేది కొన్ని పార్టీలకు రాజకీయ ఎజెండా అంటూనే అమిత్ షా తమ రాజకయాం చాటారు. ఎన్నికల్లో గెలవడానికి దీన్ని కొన్ని పార్టీలు రాజకీయ అస్త్రంగా వాడుకుంటాయి. భాజపా, మోదీకి మాత్రం ఈ బిల్లు రాజకీయ అంశం కాదు. విధాన నిర్ణయాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు. ఈ బిల్లును గతంలో నాలుగుసార్లు తెచ్చినప్పటికీ ఆమోదం పొందలేదు. దేవేగౌడ హయాంలోనూ మహిళా రిజర్వేషన్ బిల్లు తెరపైకి వచ్చింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ విపక్షంలో ఉంది. ప్రధాని మోదీ కృషితోనే ఈ బిల్లు సాధ్యమయ్యిందని గొప్పగా చెప్పుకున్నారు. మహిళల ఎన్నో ఏళ్ల పోరాటం ఫలించిందని అమిత్ షా గొప్పగా పేర్కొన్నారు. బిల్లు పాస్ చేసినా వెంటనే రిజర్వేషన్లు ఇవ్వనప్పుడు ఇప్పటికిప్పుడు ఆమోదించ డంలో ఉన్న రాజకీయం ప్రజలు అర్థం చేసుకోవాలి. బిజెపి రాజకీయంలో అన్ని పార్టీలు పాత్రను పోషించాయి. అప్పట్లో యూపిఏ హయాంలో ప్రధాని మన్మోహన్ హయాంలో ఈ బిల్లు రాజ్యసభ ముందుకు వచ్చింది. నానా గందరగోళం మధ్య అప్పుడు లోక్‌సభ ముందు ప్రవేశ పెట్టలేకపోయారు. అప్పట్లో లాలూప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవులు తమ చక్రం అడ్డం వేసి బిల్లును అడ్డుకున్నారు. ఇప్పుడు బిల్లు పాసయినా మహిళలు ఎగిరి గంతేయాల్సిన అసవరం లేకుండా చేశారు. ఇక్కడా మగజాతి తమ అహాన్ని చ ఆటుకుంది. వారి దయాదాక్షిణ్యాలతో ఈ బిల్లు వచ్చినా ఆగండి.. అప్పుడే కాదని సందేశం ఇచ్చారు. రాజ్యసభలో ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడినా వేచి చూసే దౌర్భాగ్యం మహిళలకు కలిగిస్తూ..రాజకీయం చేయడం లేదనడం..పెద్ద రాజకీయం తప్ప మరోటి కాదు. మహిళల భద్రత, గౌరవం, సమానత్వం అనేవి తమ ప్రభుత్వానికి జవసత్వాలని.. ఈ బిల్లు ఆమోదం పొందడం నవశకానికి నాంది అంటూనే తాము కోరుకున్న విధంగా దీనిని తెరపైకి తెచ్చారు. కొత్త పార్లమెంట్‌లో పాత బిల్లును పాచిపోయినదానిగా సాగదీశారు. చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం దేశ మహిళలు మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తోన్న బిల్లుకు మోక్షం కలిగే పక్రియ చివరి దశకు చేరుకున్న వేళ ఇంతగా నిరాశ కలిగిస్తారని సగటు మహిళ ఊహించి ఉండదు.

తాజాగా ఇది లోక్‌సభలో ఆమోదం పొందడం.. విపక్షాలు కూడా ఈ బిల్లుకు మద్దతివ్వడంతో మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చేందుకు అడుగు దూరంలో ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును సెప్టెంబర్ 12, 1996లో గీతా ముఖర్జీ తొలిసారి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆమె.. బిల్లుపై సమగ్ర సమీక్ష జరిపి, ఏడు కీలక సిఫార్సులు చేశారు. పార్లమెంటు ముందుకు ఈ బిల్లు రావడం ఐదోసారి కావడం గమనార్హం. సీపీఐ నేషనల్ కౌన్సిల్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీల్లోనూ సభ్యురాలిగా పనిచేశారు. వివిధ పార్లమెంటరీ కమిటీల్లో సభ్యురాలిగా ఉన్న ఆమె.. మహిళలకు సంబంధించిన అనేక కమిటీల్లో ఉన్నారు. సామాజిక న్యాయం, మహిళల హక్కుల కోసం పోరాటంలో తన బలమైన గళాన్ని వినిపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకోసం ఎంతో పోరాడిన ఆమె.. ఆయా ప్రభుత్వాలు దాన్ని పార్లమెంటులో ఆమోదింప జేయడంలో విఫలం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఎలాగైనా ఆమోదం పొందేందుకు చివరి వరకు తన ప్రయత్నాలను కొనసాగించారు. తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినప్పటికీ ఈ బిల్లు సభ ఆమోదానికి నోచుకోలేదు. చివరకు ఈ బిల్లు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగులోనే ఉండిపోయింది. 2014లో లోక్‌సభ రద్దు కావడంతో అక్కడే బిల్లు మురిగిపోయింది. ఈ నేపథ్యంలో మోదీ సర్కార్.. మహిళా రిజర్వేషన్లపై కొత్త బిల్లును తీసుకురావడం ద్వారా ఆమోదం దక్కినప్పటికీ మరో ఐదారేళ్లు వేచి చూడాల్సిన ఖర్మ పట్టించారు.

# భాద్రపదంలో భాగవత సప్తాహాలు

## నేటి నుంచి పురాణ కాలక్షేపాలు ప్రారంభం

ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం నుండి భాగవత పురాణ సప్తాహాలు ప్రారంభం కానున్నాయి. దండ కారణ్యంలో సూత మహర్షి, శౌనకాది మహా మునులకు వివరించిన సనాతన పురాణ ప్రవచన సాంప్ర దాయం ఈ క్షేత్రంలో శతాబ్దాల క్రితంనుండే ఆచరణలో ఉంది. క్షేత్రానికి చెందిన శ్రీనృసింహ పీఠ నిర్వాహకులు రొట్టె వాసుదేవ దీక్షితులు 500 సంవత్సరాలకు మున్నే భాగవత పురాణ సప్తాహ ప్రవచనం గావించిన సందర్భాలను బట్టి పురాణ ప్రవచన, శ్రవణ ప్రాచీనత్వం స్పష్టమవుతుంది.

రొట్టె విశ్వనాథ సోమయాజులు, నరహరి దీక్షితులు, సదాశివ శాస్త్రి, సంగనభట్ల రాజేశ్వరునిగా లబ్ధప్రతి షలైన బాల సరస్వతి, సంగనభట్ల నరహరి శాస్త్రి తదితరులు పాత తరాలలో, రావులపెల్లి సాంబశాస్త్రి, అలువాల వేంకటేశ శాస్త్రి, తాడూరి బాలకృష్ణ శాస్త్రి, పణతుల కృష్ణ శాస్త్రి, రొట్టె చంద్రశేఖర శాస్త్రి, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, కాకెర్ల లక్ష్మీకాంత శాస్త్రి, ధర్మపురి క్షేత్ర మహాత్మ్య గ్రంథ పరిష్కర్త కశౌజ్జల సదాశివ శాస్త్రి, కాకెర్ల లక్ష్మీ నరహరి శాస్త్రి, దేవళ్ళ రామకృష్ణ శాస్త్రి, నారంభట్ల పెద్ద వెంకటేశ శాస్త్రి, వెల్మకన్నె హన్మాన్ శర్మ, ఉస్మానియా విశ్రాంత రీడర్ డాక్టర్ కొరిడె రాజన్న శాస్త్రి, కాకెర్ల కృష్ణశాస్త్రి, కాకెర్ల దత్తా త్రేయ శర్మ, సుప్రసిద్ధ గురుపీఠ వంశపారంపర్య పౌరాణి కులు రొట్టె విశ్వనాథ శాస్త్రి, శృంగగిరి ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర, పురాణ వాచస్పతి బాచంపెల్లి సంతోష్ కుమార శర్మ, సంస్కృతాంధ్ర పండితులు గుండి సీతారామ శాస్త్రి, నారంభట్ల వేంకటేశశర్మ, కొరిడె విశ్వనాథ శర్మ ప్రభృతులు పురాణ ప్రవచన సాంప్రదాయ వారసత్వ పరిరక్షణకై నడుంబిగించి, అంకిత భావంతో, లాభాపేక్ష లేని నిస్వార్థ కృషి సల్పుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల లలో ప్రవచనాలను నిర్వహిస్తునే ఉన్నారు.



అపర వేదవ్యా సులుగా పేరెన్నికగన్న శ్రీగుండి రాజర్షి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పివి నర్సింహారావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం లాంటి మహామహు లెందరో ప్రత్యేకించి, క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి భాగవత ప్రవచనాలను విని ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు క్షేత్రవాసులకు చర్విత చర్వణాలే. కవి సామ్రాట్ విశ్వనాథచే 'మ్రోయు తుమ్మెద'లో వర్ణించబడిన గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను నిరంతర అధ్యయనం చేస్తూండగా, పాశ్చాత్య పండితులెందరో పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వచ్చి వెళ్ళిన సంఘటనలు క్షేత్ర వాసులకు నిత్య జ్ఞాపకాలే. ఆ ప్రాచీన సాంప్రదాయాన్ని కొనసా గిస్తూన్నారు.

ప్రాచీన ఆర్ష విజ్ఞా నానికి, సనాతన సాంప్రదాయాలకు పట్టుకొమ్మయై, వేద సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమై, పుణ్యభూమిగా వెలుగొందుతున్న భారతావనికి చరిత్రకు అందనంత పూర్వమైన, ఉజ్వల సాంస్కృతిక, వైదిక, తాత్త్విక, పౌరా ణిక, ఐతిహాసిక, చారిత్రక వారసత్వం ఉంది. వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జైమిని, పరాశర, ఆపస్తంభాధి మునులు, రుషులు,యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వారసత్వాన్ని కొనసా గిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక, ఆదిభౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచానాలను వేద భూమి పరిరక్షిస్తూనే ఉంది. దండకా రణ్యంలో సూత మహర్షి, శౌనకాది మహా మునులకు వివరించిన సనా తన పురాణ ప్రవచన సాంప్రదాయం తెలుగు నేలపై అనాదిగా ఆచరణలో ఉంది.

శ్రీమద్భాగవతం హిందూమత సాంప్రదాయాలలో, సాహిత్యంలో, ఆలోచనా విధానంలో ముఖ్యమైన ప్రభావం కలిగిన పురాణం. అష్టాదశ పురాణాలను ప్రస్తావించే దేవీ భాగవతంలోని శ్లోకంలో భాగవతం ఉప పురాణంగా చెప్పబడింది. భగవంతుని, భగవద్భక్తుల కథలు గాను, భక్తి యోగాన్ని చాటి చెపుతున్న ప్రాచీన గాథ. భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్వ, ముక్తిలతో కూడుకున్నదే భాగవతం. శమేక మహర్షి కుమారుడైన శృంగి చేత శాపగ్రస్తుడైన పాండవ మధ్య ముడైన అర్జునుని మనమడైన పరీక్షిన్మహరాజు, ఏడు దినములలో మరణించడం జరుగుతుందని తెలిసి, తన రాజ్య విధులన్నీ పక్కనపెట్టి ప్రతి జీవి అంతిమ లక్ష్యాన్ని తెలుసుకోవాలనుకొన్నాడు.

ఈ సందర్భంలో, వేదవ్యాస మహర్షి సుతుడైన శ్రీశుక యోగీంద్రుడు ప్రప్రథమంగా భాగవత పురాణం వినిపించిన నేపథ్యం ఉంది. జీవునియొక్క అంతిమ లక్ష్యం.... నిత్యసత్యమైన లీలామానస విగ్రహుడు శ్రీకృష్ణుని గురించి తెలుసు కోవడమేనని శ్రీశు కుడు వివరిస్తాడు. భాగవతంలో వివిధ భాగాలను స్కంధాలు అంటారు. వివిధ స్కంధాలలో విష్ణువు అవతారాలు, కార్యాలు, భక్తుల గాథలు, తత్వ బోధనలు, ఆరాధనా విధానాలు, ఆధ్యాత్మిక సంబంధ సంవాదాలు,




(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

భగవంతుని లీలలు, సవివర వర్ణనలతో ఉన్నాయి. ద్వాదశ స్కంధాలు కలిగిన భాగవతాన్ని పూర్వం పరీక్షిత్తుకు శ్రీశుక యోగీశ్వరుడు వివరించిన నేపథ్యం ఆధారంగా భాద్రపద మాసపూర్వార్ధంలో సప్తాహ రూపేణ వారం రోజుల పాటు ప్రవచించడం, సాంప్రదాయాచరణాసక్తులైన భక్తులు క్రమం తప్పకుండా శ్రవణం గావించడం శతాబ్దాలుగా కొనసాగు తున్నది.

భాగవత సప్తాహ కార్యక్ర మాలు సాధారణంగా భాద్రపద శుక్ల సప్తమి నుండి వారం రోజులు నిర్వ హించ బడతాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం క్రమానుగతిన విస్తరిస్తున్న క్రమంలో, భాగవతంలో అప్పటి సిద్ధాంతాల ప్రకారం పలు అంశాలు ఇమిడి ఉన్నాయి. 3వ స్కంధం (11వ అధ్యాయం)లో సమయ విభాగం గురించి, సూక్ష్మకాలం పరమాణు ప్రక్రియలకు పట్టే కాల పరిమాణం, స్థూల కాలం విశ్వం వయస్సుగా వివరించ బడింది. అలాగే స్కంధంలో కకుద్ముడు అనే రాజు తన కుమార్తె రేవతిని బ్రహ్మ లోకానికి తీసుకొని పోయి, కొద్ది సమయం బ్రహ్మను దర్శించి, తిరిగి భూలోకానికి వచ్చే సరికి వేల ఏళ్ళు గతించిన విషయ ప్రస్తావన ఉంది. 3వ స్కంధంలో గర్భస్థ పిండం పెరిగే ప్రక్రియ వర్ణింప బడింది.

### ధర్మపురిలో నేటి నుంచి భాగవత సప్తాహాలు

వారం రోజుల పాటు భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమాలు జరుగనున్నాయి. దేవస్థానం, స్థానిక శారదా మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీరామ లింగేశ్వర ఆలయంలో... వారం రోజులపాటు నిర్వహించ నున్నారు. ఇందుకు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నారు. "సర్వ వేదాంత సారం హి శ్రీ భాగవతమిస్యతే, తద్రసామృత తృప్తస్య నాస్యత్ర స్యాద్రతి క్వచిత్", శ్రీమత్ మహాభాగవతం..."సకల వేదాంత సారం. భాగవత రసామృ తాన్ని పానం చేసిన వారికి మరే ఇత రములు రుచించవు. భాగవతం పురాణాలలో ముఖ్య స్థానాన్ని సంతరించుకుంది.



## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# అనగనగా ఒక నక్కకథ



ఆ రోజు ఆదివారం తెల తెలవారుతున్న అడవిలో నక్క నడ్డి ఊపుకుంటూ నడచుకుంటూ వెళ్లి తనకిష్టమైన పెద్ద మర్రిచెట్టు వద్దకు వచ్చి వీపును చెట్టు కానించి రెండు ముందు కాళ్ళు తల కింద పెట్టుకుని కాలుమీద కాలేసుకుని ఆకాశం వైపు చూస్తున్న సమయంలో చంకలో దినపత్రికలు పట్టుకున్న కోతి ఒకటి మర్రి ఊడ పట్టుకుని టార్జాన్ లా రయ్యిమని వచ్చి ఆగి నక్కచుట్టు ఆదివారం దిన పత్రికలన్నీ విసిరేసి 'వస్తా నక్క మామా.. . పేపర్లు ఇంకా చాలామందికి ఇవ్వాలి. సమయం లేదు' అంటూ మరో ఊడ పుచ్చుకుని రయ్యిమని వెళ్ళిపోయింది.

నక్క తనలో తానూ ' కోతి బావ.. నీ పనే హాయి ఏ కాయో పండో ఆకులో తిని బతికేకేస్తావు " అనుకుంటూ రోజు పేపర్ చదివే అల వాటులో భాగంగా నక్క ఒక పేపర్ అందుకుని చదవడం మొదలు పెట్టింది. ' పదవిపోయిన మంత్రి , లంచగొండి పోలీసు , మోసపోయిన యువతీ , పార్టీ మారిన మంత్రి, ధర్నాలు, వాహన ప్రమాదాలు..ఛ.. ఏం వార్తలండి బాబు.. రోజు ఇదేగోల.. వార్త ల బదులు కథలు చదువుకుంటే బాగుంటుంది.

'అనుకుని అన్ని పేపర్లలోని కథలు చదివి కోపంతో పేపర్లు విసిరి కొట్టి.. ఛ.. ఏం బతుకో నాది.. ఒక కథలో అయినా నాగురించి మంచిగా వ్రాసారా? అనుకుంటే... ప్రతి రచయితకి ఇదే అలవాటు అయిపోయింది. నాకు ఊహ తెలిసి నప్పటి నుండి కథలు చదివిన కథలన్నింటిలో నక్క చెడ్డది, జిత్తుల మారి, గుంటనక్క, ఎంగిలి మెతుకుల మాంసం తినేది, నీచు తిని బతికేది.. ఇలా ంటి రచనలు చేయడం వల్ల నా వ్యక్తిత్వం దెబ్బతిని పోయింది..

తరతరాలుగా మా వంశస్తులే రాజుకు మంత్రిగా వున్నున్నారు కదా.. మేము లేకపోతే అడవి కంతటికీ రాజైన సింహానికి సలహాలు ఇచ్చేది ఎవరు ? నా వల్లె రాజుకు పరిపాలన సాగిస్తాడు కదా ?. ఇవన్ని పక్కన పెడితే. అసలు. ఎవడు కనిపెట్టాడోకాని. ఈ.సామెతలు. వాటిలోకుడా లోకువై పోయాను.. . నక్క జిత్తులు నారాయణ ఎరుగు. నక్క ఎక్కడ? నాగలోకం ఎక్కడ ?. నక్క కడుపులో సింహం పుడుతుందా? ఇలాంటి సామెతలు, కథలు చెప్పేవాళ్ళు , వినేవాళ్ళు. చిన్నలు, పెద్దలు, అమ్మమ్మలు. నాన్నమ్మలు , బామ్మలకు కుడా నేను చులకనైపోయి, వాళ్ళ దృష్టిలో మోసకారిగా, నక్కగా మిగిలిపోయాను. నా బతుకెందుకు ?.. ఒక్క రచయిత అయినా నాగురించి మంచిగా వ్రాస్తాడా ?

అయ్యా రచయితల్లారా ఇకనైనా. ఇప్పటికైనా మించి పోయింది లేదు.. .. అన్ని మీరేచేశారు.. అంతా మీ చేతుల్లో నీ కలంలోనే వుంది.. ఇక మీదట అయినా నా గురించి చులకనగా వ్రాయకండి. ' అని అనుకుంటూ తల కింద ముందు కాళ్ళు పెట్టుకుని ఆలోచిస్తుండగా దూరంగా ఆకాశంలో ఎర్రని సూర్యుడు వస్తుండగా ఒక జింక, పచ్చటి గడ్డిని మేస్తు కనిపించింది. అందమైన దృ శ్యాన్ని చూస్తూ 'ఇలాంటి అందమైన జింకను చూసే కదా సీతమ్మ మోసపోయింది. రాముడు దాని వెంట పడడం వల్లే కదా రామా యణం జరిగింది. అలాంటి జింక గురించి మోసకారి అని ఒక్క రచయిత అయినా వ్రాశాడా ?.

నేను దాని అంత అందమున్న దాన్ని కాదు కదా.. లాభం లేదు.. నేను ఏదోఒక మంచి పని చేసి మంచి దాన్ని అని నిరూపించుకోవాల్సిందే అనుకుంటుండగా. మెల్లగా అడుగులేసుకుంటూ సింహం రాజు అక్కడకు నక్కను చూడగానే.. నక్క గబాలున లేచి వినయంగా నిలుచుంది.

'ఏం మంత్రి వర్యా. దినపత్రికలన్నీ చదివేసావా?.. ఇంకా ఏమన్నా మిగిలి ఉన్నాయా ? ' అనగానే మహా రాజు. . అన్ని చదివే సాను. ఒక నిర్ణయానికి వచ్చాను అంది. 'అబ్బో.. ఏమిటో ఆ నిర్ణయం' అని అడుగగా 'మహారాజ ఈ రోజు ను0డి రోజు ఒక మంచి పని చేస్తామనుకుంటున్నా.. అంతలో మీరు వచ్చారు.. .

ఆ మంచి పనేదో మీతో మొదలు పెట్టాలనుకుంటున్నాను. ఏమిటా మేలైన మంచి పని'.. అంది గంభీరమైన గొంతుతో, అదిగో గడ్డి మేస్తున్న జింక వుంది. చూడండి. దాని దగ్గరకెళ్ళి దాన్ని మాటల్లో పెడుతాను. మీరు.. ఆ పక్క పొదల్లోనుండి మెల్లగా అక్క దకు వచ్చేయండి-అంటూ కన్ను కొట్టి నాలుక బయట పెట్టి, తోక తిప్పుకుంటూ వెళ్ళిపోయింది..

ఆ తరువాత కథ ఈ కథ చదువుతున్న పాఠకుల్లారా తర్వాతా ఏం జరిగి వుంటుందో మీ ఉహకే వదిలేస్తున్నా!

**కంచనపల్లి ద్వారకనాథ్,**
**9985295605**

# కాంగ్రెస్‌లో ఆశావహుల సందడి

## టిక్కెట్ల కోసం మొదలైన పైరవీలు

## అగ్రనేతల అనుగ్రహం కోసం ప్రదక్షిణలు

హైదరాబాద్,సెప్టెంబర్21 : తెలంగాణ కాంగ్రెస్‌లో అత్యుత్సాహం నెల కొంది. టిక్కెట్ల కోసం ఆశావహులు పోటీ పడుతున్నారు. పాతకాపులక సీట్లకు మాత్రం ధోకా లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా.. కొత్తవారు సైతం తమకు సీట్లు అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలో స్క్రీనింగ్ కమిటీ పెద్ద కసరత్తే చేస్తోంది. అలాగే కర్నాటక ఊపుతో మొన్నీ మధ్య ప్రకటించిన ఆరు అద్భుతాలు కాంగ్రెస్‌ను గట్టెక్కిస్తా యన్న ఆశలో నేతలు ఉన్నారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే గెలుపు గుర్రాలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిసారించింది. స్క్రీనింగ్ కమిటీ.. అభ్యర్థుల ఎంపికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ- పీఈసీ ప్రతిపాదనలపై ఇప్పటికే సర్వే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. సర్వేలు, సామాజిక, స్థానిక రాజకీయ స్థితిగతుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు టికెట్లు ఆశిస్తున్న వారు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వద్దకు క్యూ కడుతున్నారు. తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఏఐసీసీ ముఖ్యనేతలను సంప్రదిస్తూ ఎలాగైనా తనకు టికెట్ వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు. కొందరు కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలిసేందుకు బెంగళూరుకు పరుగులు తీస్తున్నారు. బీసీ నేతలు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ బీవీ హరిప్రసాద్ ద్వారా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇటీవల సీడబ్ల్యూసీ సభ్యుడిగా నియమితులైన రఘు వీరా రెడ్డి ద్వారా కొందరు పైరవీలు ప్రారంభించారు. ఇందుకోసం ఏపీ బాట పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్ చార్జిగా ఉన్న మాణిక్కం ఠాగూర్ ను, దిగ్విజయ్ సింగ్ ను, వీరప్ప మొయిలీని, దిగ్విజయ్ సింగ్ ను కలిసి తమకు టికెట్ వచ్చేలా చూడాలని పలువురు వేడుకుంటున్నట్టు సమాచారం. జైరాం రమేశ్, కొప్పుల రాజా ద్వారా కూడా కొందరు టికెట్ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలపై మరింత స్పీడ్ పెంచిన తెలంగాణ కాంగ్రెస్.. అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో కసరత్తు మొదలుపెట్టింది. మొన్నటివరకు సీడబ్ల్యూసీ సమావేశం, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తూ నేతలు బిజీబిజీగా ఉన్నారు. ఇటీవల సమావేశాలు ముగియడం, బహిరంగ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ పెట్టింది.ఒకరి కంటే ఎక్కువమంది పోటీ లేని నియోజకవర్గాలకు ముందుగా అభ్యర్థులను ఖరారు చేయ నుంది. ఇందులో భాగంగా మొత్తం 119 స్థానాల్లో ముందుగా 30 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనుంది. నంతరం అభ్యర్థుల జాబితాను సీఈసీకి స్క్రీనింగ్ కమిటీ పంపనుంది. దాదాపు 35 మంది పేర్లతో కూడిన మొదటి జాబితాను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. స్క్రీనింగ్ కమిటీ దాదాపు 35 చోట్ల అభ్యర్థులను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. వారి పేర్లను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనుంది. అక్కడ సంతకం పడ్డాక జాబితాను ప్రకటించనున్నట్టు సమాచారం. 70 నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ సెగ్మెంట్లలో ఇద్దరు నుంచి ముగ్గురు అభ్యర్థులు టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. ఈ సెగ్మెంట్లనూ ఓ కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మహిళా బిల్లు నేపథ్యంలో ఢిల్లీలోనే ఉన్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు అక్కడే భేటీ అయి తొలి జాబితాను ఖరారు చేస్తారని తెలుస్తోంది.

## స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి



కొడిమ్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం భవనంలో చెన్న దేవేందర్ అధ్యక్షతన తెలంగాణ జాతిపిత పద్మశాలి ముద్దుబిడ్డ కొండ లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగినది. సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.... ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తోలితరం ఉద్యమకారులు, రాజీలేని తెలంగాణ పోరాట యోధుడు,మూడు తరాల ఉద్యమ నాయకుడు బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి బిసి వర్గాల, తెలంగాణా ఆవిర్భావం కొరకు అలు పెరుగని పోరాటం చేసిన స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చెన్న దేవేందర్, ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాజేంద్రప్రసాద్, కోశాధికారి గాలిపెల్లి రాజు, ఉపాధ్యక్షులు మంచాల భూమేష్, ఉప కార్యదర్శి సామల శేఖర్, ట్రస్టు అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్, కార్యదర్శి ఎల్లం పరమేశ్వర్, కోశాధికారి కొండ లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు కుల సభ్యులు కొక్కుల నరేష్, గాజుల సత్యనారాయణ, తడక హనుమాండ్లు, కోడం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లులు వెంటనే ప్రవేశపెట్టాలి



భీమదేవరపల్లి సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ (ఎం.ఎల్.ఏఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత 30 సం.లుగా ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం మాదిగలు పోరాటం చేస్తున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఛలో ఢిల్లీ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు తరలి వెళ్లారు. ఈ బృందంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు కొంగర పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల అనిల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గోవిందా నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధుకర్ తదితర న్యాయవాదులు ఉన్నారు.

## భారత ఆహార సంస్థను సందర్శించిన మీడియా ప్రతినిధులు



జమ్మికుంట సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): జమ్మికుంట పట్టణంలో గల భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) డిపో ను గురు వారం నాడు కరీంనగర్ జిల్లా మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత ఆహార సంస్థ డిపో మేనేజర్ వి. కుళ్ళాయప్ప నాయక్ గారు వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వారు అక్కడ జరుగుతున్న ధాన్యం సేకరణ విధానం, శాస్త్రీయ పద్ధతిలో భదపరిచే విధానం, ఆహారధాన్యాల సరఫరా, ఆహారధాన్యాల పోషణీకరణ మరియు ఆహార భద్రత కొరకు తీసుకుంటున్న చర్యల గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలు మరియు టీవీ చానెల్ ప్రతినిధులు హాజరై భారత ఆహార సంస్థ అవశ్యకత గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థకు సంబంధించిన క్వాలిటీ మేనేజర్ ప్రకాష్, ఇతర మేనేజర్లు శ్రీధర్, వెంకటనారాయణ, ఆనంద్ సంస్థ యొక్క సిబ్బంది,కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్గీయ కొండా లక్ష్మన్ భాపూజీ వర్ధంతి వేడుకలు



గొల్లపల్లి సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): గొల్లపెల్లి మండల కేంద్రమంలో పద్మశాలి సంఘ భవనంలో ఆచార్య కొండా లక్ష్మన్ భాపూజీ వర్దంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అద్యక్షులు చౌటపెల్లి తిరుపతి మాట్లాడుతూ.. కొండా లక్ష్మన్ భాపూజీ నిజామ్ వ్యతిరేక పోరాటమంతో పాటు తెలంగాణ ఉద్యమ సమయమ్మంలో ముందుండి నడిపించారు మరియు పద్మశాలి సంఘ అబివృద్దికి కృషి చేశారు. ఆయన ఆశయ సాదనలో మేము పాలు పంచుకుంటాం. ఈ కార్యక్రమంలొ అద్యక్ష ,కార్యదర్శి చౌటపెల్లి తిరుపతి, అందె లక్ష్మన్, ఉపాద్యక్షులు ఎనగందుల శంకర్, గౌరవ అద్యక్షులు అంకం భూమయ్య, గాజెంగి సత్తయ్య, యూత్ అధ్యక్ష, కార్యదర్శి అంకం రవి, అంకం సతీష్, చౌటపల్లి రమేష్, అనుమల్ల వెంకటేష్, అంకం లక్ష్మినారాయణ, సామల వీరాస్వామి, సంతోష్, కుల బంధువులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా స్వర్ణ కార సంఘ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి సంఘానికి జిల్లా కేంద్రంలో ఒక ఎకరం స్థలం కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేయగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసు కెళ్లి స్థలం మంజూరుకు కృషి చేస్తాననన్నారు. పాల్గొన్న అధ్యక్షులు రంగు రాజయ్య, కోశాధి కారి కిషన్, ప్రధాన కార్యదర్శి మారుతి, టి వి సూర్యం, లక్ష్మణ్, తదితరులు

(ప్రజామంటలు)

# రైతులకు రుణమాఫీ లబ్ధి జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు

### నిర్దిష్ట సమయంలో లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా



జగిత్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): రైతులకు రుణమాఫీ ప్రక్రియ వేగవంతంగా పూర్తీ చేసి లబ్ధి జరిగేలా చూడలని, సకాలంలో లక్ష్యాలను పూర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల సముదాయాల సమావేశ మందిరంలో వ్యవసాయ రుణాలు, క్రాప్ లోన్లు, రైతు రుణ మాఫీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమీక్ష కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు లక్షా 20 వేల రూపాయల రుణ పరిమితి ఉన్న రైతులకు లక్ష రూపాయల పంట రుణమాఫీ చేసారని తెలిపారు. రుణమాఫీ జరిగిన రైతులకు నూతన రుణాల మంజూరు పై ఎస్.ఎల్.బీ.సి లో బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, సెప్టెంబర్ చివరి వరకు రుణమాఫీ జరిగిన ప్రతి రైతుకు నూతన రుణాల అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణమాఫీ జరిగిన ప్రతి రైతుకు నూతన రుణం అందే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. రుణమాఫీ ప్రక్రియ సంబంధించి సాంకేతిక సమస్యలు కారణంగా లబ్ధి పొందని రైతులలో ఇతర బ్యాంకు ఖాతా వివరాలు లభించని జాబితా పంపామని, వ్యవసాయ విస్తరణ అధికారులచే ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసి సదరు రైతులకు కూడా రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనవసరమైన కారణాలు తెలిపి రైతుల ఖాతాలలో ఉన్న నగదును హెూల్డ్ లో ఉంచకూడదని కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. రైతు రుణమాఫీ సంబంధించి చివరి రైతు వరకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని, బ్యాంకర్లు వద్ద నుంచి గ్రామం వారీగా రుణమాఫీ సమాచారం సేకరించి వ్యవసాయ విస్తరణ అధికారులచే క్షేత్రస్థాయిలో ప్రతి రైతు రుణ మాఫీ లబ్ధి పోందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ధరణి కూడా ఒక భాగమే అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వెరిఫికేషన్ మాత్రమే చేస్తారని, మిగతా వివరాలు బ్యాంకు అధికారులు మాత్రమే తెలపాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, ఎస్.సి. కార్పోరేషన్ ఈ.డి. లక్ష్మి నారాయణ, వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బోరు మోటర్, ప్రహరీ గోడకు నిధులు మంజూరు



జగిత్యాల రూరల్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన కురుమ సంఘం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్వార్టర్లో కలిసి గ్రామంలోని బీరయ్య ఆలయంలో బోరు మోటర్, ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేయగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే 2.5 లక్షల నిధులు సత్వరమే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, నాయకులు దనేశ్వరరావు, దండిగ శంకర్, గిద్దె రాజు, ఎంపీటీసీ లక్ష్మి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## కల్లెడ గ్రామానికి చెందిన 200 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరిక



జగిత్యాల రూరల్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): రూరల్ మండలములోని కల్లెడ గ్రామానికి చెందిన 200 మంది నాయకులు యువకులు గ్రామానికి చెందిన మైనార్టీ, వడ్డెర, విశ్వబ్రాహ్మణ, ఎస్సీ, రజక సంఘల కార్యవర్గ సభ్యులు, యూత్ సభ్యులు కల్లెడ పాక్స్ ఛైర్మెన్ సందీప్ రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వర రావు, ఎంపీటీసీ పరశురామ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, నాయకులు బాల ముకుందము, దావ సురేష్, నక్కల రవీందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, చెరుకు జాన్, హరి కిషన్ రావు, రాజన్న, అంజి, మంచాల రాజు, శ్రీనివాస్, రాజేశం, రమేష్, మేండే లక్ష్మణ్, మొగిలి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందుర్తి యువసేన యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు

### ఉదయం, సాయంత్రం పూజలు

### రాత్రి భజనలతో పాటు సంస్కృతిక కార్యక్రమాలు



చిగురుమామిడి సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలో అంగడి బజార్ లోని యువసేన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో ప్రతిరోజు పండితులు శంకరాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణతో పాటు గణపతిని ఉదయం సాయంత్రం తీరొక్క పూలతో అలంకరించడం రాత్రి వేళలో లైటింగ్స్ సౌండ్స్ తో గణేష్ మండపాలు కళకళలాడు తున్నాయి. ప్రతిరోజు ఉదయం వేకువ జామున భక్తి పాటలతో గ్రామంలో ప్రశాంతత వాతావరణం కనిపిస్తుంది. అనంతరం గ్రామాల్లో నిర్వహకులు, ఆ కాలనీవాసులు వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం సాయంకాలం పూజా కార్యక్రమాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేసి మధ్యాహ్నం అన్నదాతల సహాయ సహకారాలతో మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మరికొందరు రాత్రి వేళలో సైతం మండపాల వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం విశేషం రాత్రి వేళలో గణేష్ మండపాల వద్ద చిన్న పెద్ద తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఓగ్గు కథలు మహిళలు దాండియా కోలాట ఆట పాటలు నిర్వహించడం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీని గణేష్ నవరాత్రుల వేడుకలు ప్రతి గ్రామంలో గల్లి గల్లి లో సందడే సందడి కనిపించడం విశేషం పోలీసులు సైతం ప్రతిరోజు మండలంలోని 17 గ్రామాల్లోని మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తగు జాగ్రత్తలు తెలియజేస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు నిర్వాకులు లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ యువసేన యూత్ అధ్యక్షులు గాదె రఘునాథ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బందెల శ్రీనివాస్, పున్నం సంపత్, సొన్నాయిల భరత్ నాయి, కంతాల తిరుపతిరెడ్డి, కంది మల్లారెడ్డి, సాయి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లు పట్ల హర్షాతిరేకాలు



గుంతకల్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): దేశ చరిత్రలోనే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించిన సందర్భంగా గుంతకల్ పట్టణంలో మోదినబాత్ లాల్ బహదూర్ శాస్త్రి స్కూల్ నందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలుపుతూ ప్లే కార్డులు పట్టుకొని మోడీ చిత్రపటాలని పట్టుకొని మహిళలందరూ కలిసి వారికి ధన్యవాదాలు తెలుపడం జరిగింది. అందరికీ మిఠాయిలు పంచుతూ ఘనంగా సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వనగుంది విజయలక్ష్మి మరియు అసెంబ్లీ కన్వీనర్ విశ్వనాథ్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించడం ఇది భారతదేశంలో ఒక చారిత్రాత్మక ఘట్టం అని మరియు భారత జనతా పార్టీ మహిళల కోసం కృషి చేస్తూ మహిళలకి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపడుతూ మహిళ అభివృద్ధిని ధ్యేయంగా పనిచేస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. విశ్వకర్మ యోజన ద్వారా అనేక కుల వృత్తుల వారికి రుణాలు పొందే అవకాశాన్ని మోడీ కల్పించారు. ఇలా కుల మతాల భేదాలు లేకుండా అన్ని మతాల వారికి సమానత్వంగా చూస్తున్న మోడీ మరొక్కసారి ప్రధానమంత్రి కావాలని అందరూ ఆకాంక్షిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ అసెంబ్లీ కన్వీనర్ విశ్వనాథ్ బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వనగుంది విజయలక్ష్మి, మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి, జిల్లా ట్రేడింగ్ సెల్ కన్వీనర్ జివిఎం మహేష్ జిల్లా బిల్డింగ్ సెల్ కన్వీనర్ గుర్రం సూర్యనారాయణ, మైనారిటీ మోర్చ జిల్లా కన్వీనర్ జెరాల్డ్, ఓబిసి మోర్చ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వడ్డే రమేష్ మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నరేంద్ర మోడీ కి ధన్యవాదాలు తెలిపినారు.

## మీలో ఉన్న టాలెంటును వెలికితీయడానికే 'వేస్ట్ టు వండర్ కాంపిటీషన్'

### చైర్పర్సన్ ఆకుల రజిత



హుస్నాబాద్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో సిడిఎంఏ ఆదేశాల ప్రకారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా వేస్ట్ టు వండర్ కాంపిటీషన్ యొక్క పోస్టర్ ను పురపాలక సంఘ చైర్పర్సన్ ఆకుల రజిత ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది అనంతరం చైర్పర్సన్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం మన పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్త నుండి నూతన వస్తువులను తయారుచేసి మీలో ఉన్న సృజనాత్మకంగా వెలికితీయడానికి ఇదొక సువర్ణ అవకాశమని, పట్టణ ప్రజలు, యువత, స్కూల్ విద్యార్థులు విద్యార్థినీలు ఈ కాంపిటీషన్లో అందరూ పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత రెడ్డి, కమిషనర్ ఎం. ఆర్. రాజశేఖర్, కౌన్సిలర్స్ గోవిందు రవి, మ్యాదరబోయిన శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు ఐలేని శంకర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్ర శ్రీనివాస్ గౌడ్ నియామకం



చిగురుమామిడి సెప్టెంబర్ 21 ( ప్రజామంటలు): బీసీ సంక్షేమ సంఘం చిగురుమామిడి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా బుర్ర శ్రీనివాస్ గౌడ్ ను కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ ప్రకటించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ ముదిరాజ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వములో బీసీల హక్కుల సాధన కోసం, బిసిల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, జిల్లా అధ్యక్షులు నాగుల కనుకయ్య గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు యెన్నం ప్రకాష్, మండల అధ్యక్షులు శ్రీ రామోజు రాజ్ కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, సంఘ నాయకులు తాళ్లపెల్లి తిరుపతి, నిలుగొండ దశరథం, తాళ్లపెళ్ళి భాస్కర్, కాశరాజు అంజయ్య, తుర్పాటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు



**కోరుట్ల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికై రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. కోరుట్ల పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం సభాధ్యక్షులు చెన్న విశ్వనాథం అధ్వర్యంలో నిర్వహించిన బిసి హక్కుల సాధన సమితి కోరుట్ల నియోజకవర్గ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, దేశ జనాభాలో సగానికి పైగా వున్న బీసీలు సామాజిక న్యాయానికి నోచుకోవడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు అవలంభిస్తున్న విధానాల ఫలితంగా బీసీలు ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, వైద్య తదితర రంగాల్లో వెనక్కి నెట్టివేయబడి దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, జన గణనలో బిసి కులగణన చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరుగుతుందని భావిస్తే, నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం ఉన్న బీసీల రిజర్వేషన్ ను 23 శాతానికి తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం బీసీలను ఎదగనీయకుండా కుట్రలు చేస్తుందని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 5,లక్షలకు పైగా బీసీలు దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు ఒక్కరికి కూడా రుణాలు మంజూరు చేయలేదన్నారు. అణచివేతకు గురవుతున్న బీసీలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు అన్నం అనిల్, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్, జగిత్యాల జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, కోరుట్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు జక్కుల ప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు రాచకొండ దేవయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షులు జుంబర్తి రమేష్, ప్రజా గాయకుడు లింగంపల్లి నరేష్, సీనియర్ పాత్రికేయులు గోడికే రాజు, కార్మిక సంఘం నాయకుల సుతారి రాములు, ఎం.డి. ముక్రం, బిసి నాయకులు మిట్టపల్లి రమణ, సాంబార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ చెక్ డ్యామ్ పరిశీలన



**మెట్ పల్లి సెప్టెంబర్ 21 ( ప్రజామంటలు):** మెట్ పల్లి మండల్ ఆత్మకూరు గ్రామ చెక్ డ్యామ్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధర్మపురి ఆలయ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు పర్యటించారు. ఆత్మకూర్ గ్రామం చివర్లో చెక్ డాం పక్కన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇంజనీరింగ్ డిజైనర్ లోపంతో దాదాపు రెండు వేల ఎకరాల వరకు వ్యవసాయం వెళ్లే దారి తెగిపోవడంతో రైతులు చుట్టూ తిరిగి 15 కిలోమీటర్ల మేర తిరిగి వారి భూములకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే నేను చాలా అభివృద్ధి చేసినా అంటుంటారు. ఇదేనా అభివృద్ధి అని ఏద్దేవా చేశారు. ఇది రైతుల బాధ అని దీనిపై వెంటనే అధికారులతో మాట్లాడి తెగి పోయిన రోడ్డు మరమ్మత్తులు చేసి వెంటనే రైతులకు ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## మంత్రి ఆదేశాలతో జోరుగా ఓటర్ నమోదు ప్రక్రియ



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఆదేశాలతో సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట డివిజన్ లో బీ.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఇన్నాళ్ళు డివిజన్ లోని పలు చోట్ల ఓటర్ నమోదు కేంద్రాలను పెట్టగా, ఇప్పుడు ఇంటింటికి తిరుగుతూ కొత్త ఓటర్ల నమోదు తో పాటు సవరణలు, ఇంటి చిరునామా మార్పులను చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బన్సీలాల్ పేట డివిజన్ బీ.ఆర్.ఎస్ మైనార్టీ నాయకులు మహ్మద్ అబ్బాస్ తెలిపారు. గురువారం డివిజన్ లోని పలు బస్తీల్లో పర్యటించి, కొత్త ఓటర్ల నమోదు చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించడం ఖాయమని మహ్మద్ అబ్బాస్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు కుర్మ లక్ష్మీపతి, మహ్మద్ అబ్బాస్, సాయి నిఖిల్, నాగభూషణం, నామాల ప్రేమ్ కుమార్, భరత్, రంజిత్, సాయి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## వేయి స్థంభాల దేవాలయ సందర్శన





**వరంగల్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** వరంగల్ వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ , రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం. రామకృష్ణా రావు, వరంగల్ జోన్ ఉప కమిషనర్ డి. శ్రీకాంత్ రావు, వరంగల్ కూడా చైర్మన్ శ్రీ సుందర్ రాజ్ యాదవ్ తదితరులు దేవాలయాన్ని సందర్శించి కాశీ క్షేత్రంలో ఉన్న డిండి గణపతిని మాదిరిగా వేయి స్తంభాల దేవాలయంలో ఉన్న ఉత్తిష్ఠ గణపతికి దిండి గణపతిగా అలంకరించి నవరాత్రుల్లో భాగంగా అలంకరించడం జరిగింది. స్వామివారిని దర్శించుకున్నారు.

## జగిత్యాల రూరల్, అర్బన్ లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందజేత



**జగిత్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** పట్టణ బిఎల్ఎన్ గార్డెన్స్ లో జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 640 మంది గృహ లక్ష్మి లబ్ధిదారులకు,అర్బన్ మండలానికి చెందిన 123 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసి, జగిత్యాల రూరల్, అర్బన్ మండలనికి చెందిన 59 మంది ఆడబిడ్డలకు 59 లక్షల రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జెడ్పీ చైర్మెన్ దావ వసంత, లైబ్రరీ చైర్మెన్ డా. చంద్ర శేఖర్ గౌడ్. అంతకుముందు చెక్కుల పంపిణీ కి వచ్చిన అతిథులు కొండా లక్ష్మన్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేష్, ఎంపీపీ లు ములాసపు లక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, పాక్స్ చైర్మెన్ లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, రైతు బంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి, ఎంపిడిఓ లు రాజేశ్వరి, శైలజ రాణి, ఎంపివో లు రవి బాబు, సలీం, ఆర్ఐ ఖాజిం, రెవెన్యూ అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీ లు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిదులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గారంలో సర్పంచ్ భర్త అనుచరుడి దాడి

## గాయపడ్డ జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డి.. పోలీసులకు పిర్యాదు..



గాయ పడ్డ జర్నలిస్టు చుక్క గంగారెడ్డి



హత్యయత్నం చేసిన గంగారాజం



హత్యాయత్నం చేయించిన మూల శ్రీనివాస్ గౌడ్

**బుగ్గారం సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం సర్పంచ్ భర్త మూల శ్రీనివాస్ గౌడ్ తన అనుచరుడైన గంగారాజంతో ప్రముఖ జర్నలిస్ట్, ఉద్యమకారుడు చుక్క గంగారెడ్డి పై కత్తితో దాడి చేయించారని బాధితుడు గురువారం బుగ్గారం పోలీసులకు పిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్ మూల సుమలత స్థానంలో ఆమె భర్త మూల శ్రీనివాస్ గౌడ్ చెలామణి అవుతున్నాడని, అధికారిక కార్యక్రమాలతో పాటు మండల సర్వ సభ్య సమావేశంలో కూడా హాజరు అయ్యారని ఆధారాలతో సహా బుధవారం చుక్క గంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. దీన్ని మనసులో పెట్టుకొని కుట్రతో, గంగారెడ్డి ని హత్య చేయాలని భావించి సర్పంచ్ భర్త మూల శ్రీనివాస్ గౌడ్ పథకం ప్రకారం గంగారాజం అనే అనుచరుడితో బుధవారం సాయంత్రం కాపుకాసి బ్యాంక్ సమీపంలోని ఒక హెూటల్ వద్ద దాడి చేయించారు. ఈ దాడిలో జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డి కి నుదుటిపై, చెంపలపై, కణతలో, ఛాతీలో, తలలో కత్తిపోట్లు తగిలి స్వల్పంగా రక్త గాయాలు అయ్యాయి. హత్యాయత్నం దాడికి పాల్పడ్డ గంగారాజం తో పాటు సర్పంచ్ భర్త మూల శ్రీనివాస్ గౌడ్ తో తనకు, తన కుటుంబానికి ప్రాణ భయం కలదని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఎలాంటి ప్రాణ హాని కలుగకుండా తగు రక్షణ కల్పించాలని బాధితుడు చుక్క గంగారెడ్డి బుగ్గారం ఎస్సైకి పిర్యాదు చేశారు. గతంలో అనగా 2022 మే 1న ఇదే మూల శ్రీనివాస్ గౌడ్ తన అనుచరులతో కలిసి ఏకంగా బుగ్గారం పోలీస్ స్టేషన్ గేటు ముందే తనపై హత్యాయత్నం దాడి చేశారని, అప్పట్లోనే వారిపై కేసు కూడా నమోదు కావడం జరిగిందని ఫిర్యాదులో చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు బుగ్గారం గ్రామ పంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగం, మరో వైపు సర్పంచ్ భర్త అధికారిక, మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం, ఇంకో వైపు వారి తప్పులను ఎత్తి చూపి, ప్రశ్నించి న్యాయ పోరాటం చేస్తున్న వారిపై భౌతిక దాడులకు, హత్యా యత్నాలకు పాల్పడడం హేయమైన చర్య అని బుగ్గారం గ్రామస్తులు వాపోతున్నారు. గత నాలుగు ఏండ్లుగా కొనసాగుతున్న న్యాయ పోరాటాన్ని ఎదుర్కోలేకనే సర్పంచ్ భర్త, ఆయన అనుచరులు, అతని వెనుక ఉన్న రాజకీయ శక్తులు, దోపిడీ వ్యవస్థ ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పూను కుంటున్నారని, వారందరినీ చట్టపరంగా కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





జగిత్యాల రూరల్ నర్సింగాపూర్ లో గృహలక్ష్మి పథకం క్రింద 32 మందికి పంపిణీ, 6 గురికి కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో పాల్గొన్న సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ నరేష్, తెరాస గ్రామ అధ్యక్షులు గడ్డం గంగారెడ్డి, మల్లేష్ గౌడ్, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు (ప్రజామంటలు)



జగిత్యాల పట్టణ 10వ వార్డు లింగంపేట నుండి కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది మహిళలు బిఆర్ఎస్ నాయకులు ఉదయ్, కౌన్సిలర్ సిరికొండ భారతి రాజయ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్. పాల్గొన్న కుమ్మరి సంఘం టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు చిరంజీవి, ప్రవీణ్, దామోదర్, గణేష్, రాజేందర్, అజయ్, తదితరులు (ప్రజామంటలు)




జగిత్యాల జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ప్రాంతంలో కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా గణేష్ మండపం వద్ద విద్యుత్ ఉద్యోగులు గణేష నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సాంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రతినిత్యం ఉదయము, సాయంత్రం భక్తిశ్రద్ధలతో గణేష నవరాత్రి ఉత్సవాలు కొనసాగిస్తున్నారు. (ప్రజామంటలు)



దూరదర్శన్ కేంద్రం ప్రసారభారతి హైదరాబాద్ వారు గత నెల 9న శాస్త్రీయ నృత్య విభాగం అడిషన్ నిర్వహించడం జరిగింది. ఎంతో కఠినమైన ఈ అడిషన్ లో అత్యంత ప్రతిభ కనబరిచి కూచిపూడి నాట్యం అంశంలో జగిత్యాల జిల్లా కు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యచార్యులు తెలంగాణ బీసీ సంఘ సంస్కృతిక ఆర్గనైజింగ్ సెకరేట్రి నాట్యసామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్ కు 'బి ' గ్రేడ్ ప్రధానం చేశారు. (ప్రజామంటలు)



ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్ష కొండ గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మహాగణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా గణనాథునికి కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న గంగపుత్ర మహిళా సభ్యులు (ప్రజామంటలు)



జగిత్యాల పట్టణంలోని 1వ వార్డ్ విజయపురి కాలనీ, రాయికల్ మండలంలోని అయోధ్య, కొత్తపేట మరియు జగిత్యాల రూరల్ మండల్ మోరపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి ప్రవీణ్. (ప్రజామంటలు)

prajamantalau daily pages (22-09)_times of varha main (13-2).qxd 9/22/2023 5:52 AM Page 6



# సంజయ్‌ని ఆశీర్వదించండి

### ఆసరా పింఛన్ లబ్దిదారుల ఆత్మీయ సమ్మేళనంలో

### కోరుట్ల ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు





**కోరుట్ల రూరల్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో అయిలాపూర్, తిమ్మాయిపల్లి, ధర్మారం మరియు యూసుఫ్ నగర్ గ్రామాలకు చెందిన ఆసరా పింఛన్ లబ్దిదారులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే శ్రీ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మరియు కోరుట్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డా. కల్వకుంట్ల సంజయ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు డా. సంజయ్ మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీ మన ఇంటి పార్టీ అని అందుకే ప్రజలందరికి ఏ బాధ లేకుండా ఉండాలని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందిస్తూ అందరికి అండగా ఉంటుందని అన్నారు. దానికి నిదర్శనం కేవలం అయిలాపూర్ మరియు తిమ్మాయిపల్లి గ్రామాల్లో 2089 మందికి ఆసరా పింఛన్ ఇచ్చి వారికీ బతుకుకు భరోసా ఇస్తున్నామని అన్నారు, ఆసరాతో పాటు ఇప్పటివరకు 335 మందికి కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ ద్వారా 3 కోట్ల 1 లక్ష 88 వేల రూపాయలు అందజేయడం జరిగింది. రైతుబంధు ద్వారా 2058 మంది అయిలాపూర్ రైతాంగానికి రూపాయలు 19 కోట్ల 63 లక్షల పంట పెట్టుబడి సాయం చేసిన ఘనత కేసీఆర్ ది అని అన్నారు. దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నామని అన్నారు, ఇప్పటివరకు అయిలాపూర్ లో 26 మంది రైతన్నలు మరణిస్తే వారికీ 1 కోటి 30 లక్షల రూపాయలు వారి కుటుంబాలకు అందించడం జరిగింది.

**అయిలాపూర్:** గ్రామంలో ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి ఖర్చులపాలు అయితే కేవలం ఐలాపూర్ గ్రామంలో 105 మందికి సిఎంఆర్ఎఫ్ ద్వారా 48 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. గతంలో ఎవరైన అనారోగ్యంతో అప్పుల పలు అయితే ప్రభుత్వాలు ఆదుకోలేవు కానీ మన కేసీఆర్ గొప్ప మనసుతో మనందరికీ అండగా ఉంటున్నారని అన్నారు.

**యూసుఫ్ నగర్ :** ఈ రకంగా యూసుఫ్ నగర్ లో 934 మందికి పింఛన్ ఇస్తున్నాం, 130 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా వారి పెళ్ళికి సాయపడ్డాం, 614 మందికి రైతు బంధు పంట పెట్టుబడి సాయం చేస్తున్నాము, 16 మందికి రైతులు మరణిస్తే భీమా ద్వారా సాయపడ్డాం, 39 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయపడ్డాం అని యుసుఫ్ నగర్ గ్రామస్థులకు తెలిపారు ఎమ్మెల్యే

**ధర్మారం:** ధర్మారం గ్రామానికి చెందిన 429 మందికి పింఛన్ ఇస్తున్నాం, 47 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా వారి పెళ్ళికి సాయపడ్డాం, 462 మందికి రైతు బంధు పంట పెట్టుబడి సాయం చేస్తున్నాము, 6 మంది రైతులు మరణిస్తే భీమా ద్వారా సాయపడ్డాం, 14 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయపడ్డాం అని ధర్మారం గ్రామస్థులకు తెలిపారు ఎమ్మెల్యే. ప్రతిఒక్కరు డా. సంజయ్ ని కేసీఆర్ ని ఆశీర్వదించాలని మరింత అభివృద్ధి మరియు మరిన్ని మంచి పనులు చేసే బాధ్యత మాది అని, మంది మాటలు నమ్మితే మోసపోతం మల్ల గోసపడుతాం కావున కారు గుర్తును ఆశీర్వదించాలని ఎమ్మెల్యే లబ్దిదారులను కోరారు. ఈ కార్యక్రమం లో కోరుట్ల ఆర్డీవో ఆయా గ్రామాల సర్పంచులు దారిశెట్టి రాజేష్,తోట నారాయణ, సంగెం వెంకట్రావు బీఆర్ఎస్ నాయకులు, లబ్ది దారులు పాల్గొన్నారు.

## నీట్ పీజీ కటాఫ్ స్కోర్ తగ్గిన నేపథ్యంలో దరఖాస్తుకు మరోసారి నోటిఫికేషన్




**హనుమకొండ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జిల్లాలోని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నీట్ పీజీ కటాఫ్ స్కోర్ తగ్గిన నేపథ్యంలో దరఖాస్తుకు మరో సారి నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నీట్ పీజీ కట్ ఆఫ్ స్కోర్ ను సున్నా( "0" పర్సెంటైల్) కు తగ్గించిన నేపథ్యంలో సెప్టెంబర్ నెల 21 నుంచి 24 వరకు ఆన్లైన్ లో దరఖాస్తులు కన్వీనర్, యాజమాన్య కోటాలో ఆన్లైన్ దరఖాస్తుకు ప్రకటన జారీ చేసింది. ఈ నేపథ్యం లో కన్వీనర్ , యాజమాన్య కోటాలో దరఖాస్తుకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నేడు ప్రకటనను విడుదల చేసింది. ఈ మేరకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 24న సాయింత్రం 6:00 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు సంబంధిత ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలనీ సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. అర్హత ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను చూడాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్ ప్రమాదంలో నిట్ విద్యార్థిని అక్కడికక్కడే మృతి

### మరో ఐదుగురికి తీవ్ర గాయాలు



**హన్మకొండ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** ములుగు జిల్లాలో తెల్లవారుజామున జంగాలపల్లి క్రాస్ రోడ్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్ కు ఢీ కొట్టిన ఘటనలో నిట్ (వరంగల్) లో చదువుతున్న విద్యార్థుల్లో తాడేపల్లి నిస్సి సిజు (ఏలూరు) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ముర్తుజా (హైదరాబాద్), ఉమర్ (హైదరాబాద్), సాయి (హైదరాబాద్), శ్రేయ (విజయవాడ), సుజిత్ (హైదరాబాద్). వీరంతా బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు. గాయాలపాలైన వారిని 108 అంబులెన్స్ లో మెరుగైన వైద్యం కోసం స్థానిక హాస్పిటల్ కు తరలించారు.

## కొండా లక్ష్మన్ బాపూజీ వర్ధంతి



**జగిత్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జగిత్యాల లో కొండా లక్ష్మన్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జెడ్పీ ఛైర్మెన్ దావ వసంత సురేష్ , లైబ్రరీ ఛైర్మెన్ డా. చంద్ర శేఖర్ గౌడ్ నివాళులు అర్పించారు. పాల్గొన్న జెడ్పీటీసీ మహేష్, ఎంపీపీ లు ములాసపు లక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, పాక్స్ ఛైర్మెన్ లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు,రైతు బంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి, ఎంపిడిఓ లు రాజేశ్వరి, శైలజ రాణి,ఎంపివో లు రవి బాబు, సలీం, ఆర్ ఐ ఖాజిం, రెవెన్యూ అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీ లు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిదులు, నాయకులు, తదితరులు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయి

### బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్




**హైదరాబాద్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్ అన్నారు. ఆయన గురువారం ఉస్మానియా వైద్య కళాశాలలో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టులు, బాస్కెట్ బాల్ కోర్టు, వాలీబాల్ కోర్టు లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడల ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం కూడా మెరుగవుతుందని అన్నారు. వైద్య విద్యార్థులు వారి రోజువారి పని ఒత్తిడిని అధిగమించడానికి ప్రతి ఒక్కరు క్రీడలలో భాగస్వామ్యం కావాలని అన్నారు. 2023%--%-24 సంవత్సరానికి చెందిన నూతన ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ శశికళ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ప్రతిష్టాత్మక ఉస్మానియా కళాశాలలో సీటు సాధించినందుకు ఆమె విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు. అన్ని స్పెషాలిటీ ఆసుపత్రులతో అనుసంధానమైన ఉస్మానియా మెడికల్ కళాశాల రాష్ట్రంలోనే చాలా ప్రాముఖ్యతను కలిగి ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయ, డాక్టర్ కిరణ్మయి, డిపార్ట్మెంట్ హెచ్ఓడి లు జానకి, పద్మిని, అభిజిత్ సుబేదార్, భవాని, పద్మావతి, అనిత, ఎంపిహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్, ఉపేందర్ రెడ్డి సందీప్ పాల్గొన్నారు.

## సిటీలో షురూ అయిన గణేషుడి నిమజ్జనం

**సికింద్రాబాద్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** గత 3 రోజుల నుంచి విశేష పూజలు అందుకున్న ఘణనాథుడు నిమజ్జనానికి సిద్ధమయ్యాడు. సిటీలోని పలు చోట్ల 3 రోజులకే తమ మండపాల్లోని వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో టాంక్ బండ్ కు తీసుకెళ్ళి, నిమజ్జనం చేస్తున్నారు. వాస్తవానికి 9 రోజుల పాటు గణేశ్ నవరాత్రోత్సవాలను నిర్వహించాల్సి ఉండగా, ఒకే రోజు టాంక్ బండ్ పై తీవ్ర రద్దీ ఏర్పడుతుండటం, తొమ్మిది రోజుల పాటు నియమ, నిష్టలతో నిత్య పూజలు చేయడం లాంటి కారణాలతో కొన్ని చోట్ల 3 రోజులకే తమ గణేశుడిని నిమజ్జనం చేస్తున్నారు. గురువారం బోయిగూడ లోని ఎం.ఎన్.కే విఠల్ సెంట్రల్ కోర్టు అపార్ట్ మెంట్ ఆవరణలోని వినాయకుడిని టాంక్ బండ్ లో నిమజ్జనం చేశారు. అపార్ట్ మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం మండపంలో గణేషుడికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మేళాతాళలతో , భక్తి పాటలతో గణేశుడిని టాంక్ బండ్ కు తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అపార్ట్ మెంట్ కమిటీ నిర్వాహకులు డా. జి. హనుమాన్లు, వి. ఉమాశంకర్, కే. సేతు మాధవరావు, కే. మోహన్ దాస్, వి. సుధీర్ బాబు, అపార్ట్ మెంట్ వాసులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలకు సంఘీభావం తెలిపిన జెఎస్ఆర్

### ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్ వాడి సిబ్బంది హామీలను నెరవేర్చాలి

### జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి




**భీమదేవరపల్లి సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్లు గత 11 రోజులుగా చేస్తున్న సమ్మెకు గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అంతకు ముందు వారితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, అంగన్వాడీల సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి సమస్యలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కూడా సమస్యలను పట్టించు కోవడం లేదని అన్నారు. అంగన్వాడి కార్యకర్తలతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు, ప్రజా ప్రతినిధులు అంగన్ వాడి సిబ్బందిపై బెదిరింపు దోరణి మానుకోవాలని అన్నారు. అంగన్వాడి సిబ్బందికి భారతీయ జనతా పార్టీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. వీరి వెంట బీజేపీ మండల అధ్యక్షులు పైడిపల్లి పృథ్వి రాజ్ గౌడ్, గోదాల సంపత్, శ్రీరామోజు శ్రీనివాస్, వేణు, రంజిత్, ఆంగన్ వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమలా నిలయంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**జగిత్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గం ఆధ్వర్యంలో చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్ బిల్ ఆమోదం పొందిన సందర్భంగా "కమల నిలయం" లో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయి లు పంచి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ.... మొట్టమొదటి గా మహిళా బిల్లును ప్రవేశపెట్టిన ఘనత ఎన్ డి ఏ ప్రభుత్వానికి దక్కిందన్నారు. మహిళా బిల్లు ఒక చారిత్రక నిర్ణయం ఇది భారతీయ స్త్రీలకు దక్కినటువంటి అపూర్వమైనటువంటి గౌరవం ఇది కేవలం మోడీ ఒకరి వల్లే సాధ్యమైందన్నారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అన్ని కమిటీలలో 33 శాతం మహిళా రిజర్వేషన్ ఉండేలా ప్రతి కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నరేంద్ర మోడీ కొత్త పార్లమెంట్లో మొట్టమొదటి బిల్లుగా "నారీ శక్తి వందన" బిల్లు ఉండాలని ప్రవేశపెట్టడం జరిగింది, కానీ ఇక్కడ కొందరు బి ఆర్ ఎస్ నాయకులు మాత్రం ఒకరోజు పోరాటంతో మేము సాధించామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో పారా మిలటరీ బలగాలలో కూడా మహిళలు రాణిస్తా ఉన్నారని గుర్తు చేశారు. అవని నుంచి ఆకాశం దాకా అన్ని రంగాలలో మహిళలు ఉన్నారు. బి ఆర్ ఎస్ మిత్రపక్షం అయినటువంటి ఎంఐఎం ఎంపీలు ఇద్దరు మాత్రం మహిళా బిల్లుకు ఆమోదం తెలపకపోవడం చాలా విడ్డూరంగా ఉంది ఇప్పటికైనా ప్రజలు గమనించి ఎవరు ఎవరి పక్షము తెలుసుకోవాలి. అదేవిధంగా రాజకీయాల్లో మహిళలు రావాలంటే చట్టసభల్లో 33 % మహిళా రిజర్వేషన్లు కల్పించడం చాలా శుభ సూచకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూలర్ మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, జిల్లా కోశాధికారి దశరథరెడ్డి, జగిత్యాల పట్టణ ఉపాధ్యక్షులు మడిశెట్టి మల్లేశం, జగిత్యాల్ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి భరత్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు నరసింహారెడ్డి, జగిత్యాల పట్టణ కోశాధికారి సత్యం, కాసరపు శ్రీనివాస్ గౌడ్ మరియు మహిళలు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎం.ఎన్.కే అపార్ట్ మెంట్‌లో ఓటర్ నమోదు క్యాంపు



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** సనత్ నగర్ నియోజకవర్గంలోని బోయిగూడ ఎం.ఎన్.కే అపార్ట్ మెంట్ లో గురువారం స్థానిక బీ.ఆర్.ఎస్ నాయకులు ప్రత్యేక ఓటర్ నమోదు శిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అపార్ట్ మెంట్ వాసులు కొత్త ఓటర్ నమోదు తో పాటు సవరణలు, చిరునామాల మార్పుపై దరఖాస్తులను సమర్పించారు. ఓటర్ నమోదు శిభిరానికై పద్మారావునగర్ బీ.ఆర్.ఎస్ ఇంచార్జ్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ కు అపార్ట్ మెంట్ వాసులు విజ్ఞప్తి చేయగా, ఆయన ఆదేశాల మేరకు బీ.ఆర్.ఎస్ కార్యకర్తలు ఈ శిభిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అపార్ట్ మెంట్ కమిటీ నిర్వాహకులు డా. జీ. హనుమాన్లు, ఉమాశంకర్, సేతు మాధవరావు, మోహన్ దాసు, సుధీర్ బాబు, బీ.ఆర్.ఎస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, ముక్క శ్రీనివాస్, ముకేశ్, నాగి, లక్ష్మీ పాల్గొన్నారు.

## ఆధార్ మానిటరింగ్ కమిటీ మూడవ సమావేశం



**జగిత్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టర్ సమావేశ గది యందు జిల్లా కలెక్టర్, శ్రీమతి షేక్ యాస్మీన్ ఆదేశాల క్రమము మూడవ జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశము జరిగినది. డిస్టిక్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశం డి.యం.ఎస్ డాక్యుమెంట్ అప్డేషన్స్ జిల్లాలో ఉన్న ప్రతి ఒక పౌరులు తమ తమ డీటెయిల్స్ ను ఆధార్ సెంటర్ యందు అప్డేట్ చేసుకోవాల్సిందిగా సూచించినారు. ఆధార్ నమోదు, అప్డేషన్ చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత అన్నారు. 10 సంవత్సరాల క్రితం నుండి ఆధార్ అప్డేట్ చేసుకోని వారు అప్డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని అలాగే 5 మరియు 10 సంవత్సరాలు దాటిన పిల్లలందరికీ తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని మరియు ప్రతి ఒక్కరూ 10 సంవత్సరాలకి ఒక సారి తప్పకుండా ఎంబియు (మండేటరీ బయోమెట్రిక్ అప్డేట్) చేయించుకోవలసిన అవసరముందని సూచించారు. లేదంటే రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాల అమలులో ఇబ్బందులు ఏదురుకోవలసి వస్తుందని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో అదనపు ఎస్ పి ప్రభాకర్, ఆర్డీవో కోరుట్ల రాజేశ్వర్, ఆర్డీవో మెట్పల్లి మధు, ఎల్.డి.యం వెంకట్ రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ రవీందర్, డి.యం. హెచ్.ఓ శ్రీధర్ , టి ఆర్ డిఓ నరేష్, డి.ఇ.ఓ జగన్ మోహన్ రెడ్డి, డి సిఎస్ ఓ వెంకటేష్, యుఐడిఏఐ. మేనేజర్ సత్యకల, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హనుమంత రావు , ఈ.డి.యం మమత, టీ.ఎస్.టీ.ఎస్. డిస్ట్రిక్ట్ మేనేజర్ చేతన్, టీఎస్ ఆన్లైన్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సురేష్, అధికారులు పాల్గొన్నారు.


## గడువు తేదిలోగా సిఎం ఆర్ చెల్లింపులు పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ బి.ఎస్. లత




**జగిత్యాల సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** గడువు తేదిలోగా సి ఎం ఆర్ చెల్లింపులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అధికారులను ఆదేశించినారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల సముదాయాల భవనంలోని సమావేశం మందిరంలో వానాకాలము 2021-22, యాసంగి 2021-22 మరియు వానాకాలము 2022-23 కి సంబందించిన సి ఎం ఆర్ చెల్లింపులలో పురోగతి తక్కువ ఉన్న రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2022-23 సి ఎం ఆర్ చెల్లింపులలో పురోగతి తక్కువగా ఉన్నందున ప్రభుత్వం నిర్దేశించిన 30.09.2023 గడువు తేదిలోగా సిఎం ఆర్ చెల్లింపులు పూర్తి చేయాలని, వానాకాలం 2021-22 అండ్ యాసంగి 2021-22. సీజన్ లకు సంబంధించిన బకాయిలు త్వరితగతిన చెల్లించాలని ఆదేశించినారు. తదుపరి దీనికి సంబంధించి పౌరసరఫరాల క్షేత్రస్థాయి సిబ్బందికి రోజువారీ లక్ష్యం ప్రకారము వారి పరిధిలోని మిల్లుల నుండి సిఎంఆర్ డెలివరీలు చేయించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలానే ఎఫ్ సిఐ అధికారులు సిఎం ఆర్ గోడౌన్ లలో అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని మరియు ఎస్ డబ్లుసి వారు గోడౌన్ నకు వచ్చు స్టాక్స్ దిగుమతి చేసుకొనుటకు సరిపడు హమాలీలను సమకూర్చుకోవాలని అదేశించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి అండ్ జిల్లా మేనేజర్ పౌరసరఫరా సంస్థ ఇంచార్జ్ సి. వెంకటేశ్వర్ రావు, నాయబ్ తహశీల్దార్లు, పౌరసరఫరా క్షేత్రస్థాయి సిబ్బంది మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టం జరగకుండా వ్యాపారస్తులు ధాన్యం కొనుగోలు చేయాలి



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగంతో కలిసి రైతుల ధాన్యాన్ని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం మాట్లాడుతూ మార్కెట్లో ధాన్యం చేస్తున్న రైతులకు నష్టం జరగకుండా వ్యాపారస్తులు ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు.తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రకటించిన 'ఏ' గ్రేడ్ 2203 రూపాయలకు సాధారణ రకం 2183 రూపాయలకు కనీస మద్దతు ధరలకు వ్యాపారస్తులు కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, బారాస మండల అధ్యక్షులు బైరగోని యాదగిరి గౌడ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తేజావత్ గణేష్ నాయక్, హమాలి సంఘం అధ్యక్షులు గుండెల్లి రాజు, వీరస్వామి మార్కెట్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా డబుల్ ఇళ్ల పంపిణీ

## హైదరాబాద్‌లో 30వేల ఇళ్ల పంపిణీ పూర్తి
## త్వరలోనే మరో 70వేల ఇళ్ల పంపిణీ చేస్తాం
## ఒక్కపైసా ఖర్చు లేకుండా ఇళ్ల అప్పగింత
## అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు
## దుండిగల్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీలో కేటీఆర్



**మేడ్చెల్,సెపస్టెంబర్21:** డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ అత్యంత పారదర్శకంగా జరుగుతున్న దని.. ఏ ఒక్కరికీ ఒక్క పైసా ఇవ్వవద్దని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అని పెద్దలు చెబుతుంటారు. సొంతంగా ఇల్లు కట్టాలన్నా.. ఇంట్లో ఆడబిడ్డ పెండ్లి చేయాలన్నా కష్టమని పాత కాలంలో ఈ సామెత చెప్పేవారు. కానీ ఇవాళ తెలంగాణలో అద్భుతమైన అనుభూతి కలుగుతోంది. ఇల్లు నేనే కట్టిస్తా.. పెళ్లి నేనే చేస్తా.. ఆడబిడ్డకు మేనమామగా సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని కేటీఆర్ ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కట్టిన లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లలో 30 వేల ఇండ్ల పంపిణీ ఇవాల్టితో పూర్తవుతుందని అన్నారు. మిగిలిన 70 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా అత్యంత పారదర్శకంగా రాబోయే నెల, నెలన్నర కాలంలో పేదల చేతిలో పెడతామని తెలిపారు. దుండిగల్‌లోని 4వేల ఇండ్లు కట్టేందుకు ఒక్కో ఇంటికి రూ.10 లక్షల చొప్పున ఖర్చయ్యింది. లక్ష ఇండ్లు హైదరాబాద్‌లో కడితే 9,718 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఒక్కో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టేందుకు ప్రభుత్వానికి అయిన ఖర్చు పది లక్షలు. కానీ లక్ష ఇండ్ల మొత్తానికి మార్కెట్ విలువ 50వేల నుంచి 60 వేల కోట్ల వరకు ఉన్నది. ఆ ఆస్తులను కేసీఆర్ ప్రభుత్వం పేదల చేతిలో పెడుతున్నది. ఒక్క రూపాయి లంచం చెల్లించాల్సిన అవసరం లేకుండా పారదర్శకంగా ఈ ఇండ్ల కేటాయింపులు చేశామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో జరిగిన ఆసక్తికర విషయాన్ని వివరించారు. జగద్గిరిగుట్ట డివిజన్ 126వ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కౌసల్యకు మొదటి విడతలో డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిందని.. అదే డివిజన్‌లోనే బీజేపీ నాయకురాలు సునీతకు కూడా మొదటి విడతలోనే ఇల్లు వచ్చిందని తెలిపారు. ఇవాళ దాదాపు 13,300 డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేస్తున్నాం. ఇవాల్టితో హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇండ్లలో 30వేల ఇండ్ల పంపిణీ ఇవాళ పూర్తవుతుంది. మిగతావి కూడా రాబోయే నెల, నెలన్నర కాలంలో ఇదే పద్ధతిలో.. ఇంతే పారదర్శకంగా మీ చేతులో పెడతాం. ' అని మంత్రి కేటీఆర్ అన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఏ ఒక్కరికీ ఒక్క పైసా ఇవ్వకండి అని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. కేసీఆర్ ఆలోచన మేరకు ఈ ఒక్క రోజు 8 ప్రాంతాల్లో పంపిణీ చేసిన 13300 ఇండ్లలో దివ్యాంగులకు 470, దళితులకు 1,923.. గిరిజనులకు 655, మిగిలినవారికి 8652 పంపిణీ చేశామని తెలిపారు. ఇవాళ వచ్చేటప్పుడు పేపర్‌లో ఒక వార్త చూసిన. అర్హులేమో పెద్ద సంఖ్యలో ఉన్నరు. ఇస్తున్నవి సరిపోతలేవని అంటున్నరు. మీ అందర్నీ ఒక్కటే ఆలోచించమని చెబుతున్న. ఈ ప్రభుత్వం వచ్చి తొమ్మిదేండ్లు అయ్యింది. ఈ ప్రభుత్వం వచ్చినంక నీళ్ల వసతి బాగు చేసుకున్నం. రోడ్లు బాగు చేసుకున్నం. కరెంటు బాగు చేసుకున్నం. శాంతిభద్రతలను పటిష్ఠం చేసుకుని.. పెట్టుబడులను ఆకర్షిస్తూ దేశంలో నంబర్‌వన్ స్థానానికి వచ్చినం. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో నంబర్‌వన్ స్థానంలో ఉన్నాం. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్నం. కొత్త లింక్ రోడ్లు వేసుకుంటున్నం.. బ్రహ్మాండమైన నాలాలు ఏర్పాటు చేసుకుంటున్నం. ఎన్నో కార్యక్రమాలు చేసుకుంటున్నం. లక్ష డబుల్ బెడ్రూంల కోసం దాదాపు 9,718 కోట్లు ఖర్చు పెట్టినం. మా మీద విమర్శలు చేసే నాయకులను అడుగుతున్న. భారతదేశంలో ఇంకో 27 రాష్ట్రాలు ఉన్నాయి కదా ఎక్కడైనా ఒక్క రాష్ట్రంలో ఇంత అద్భుతమైన డబుల్ బెడ్రూం ఇండ్లు చూపిస్తారా అని మంత్రి కేటీఆర్ సవాలు విసిరారు. ఎక్కడైనా 560 చదరపు అడుగుల్లో రెండు పడక గదులు, రెండు బాత్‌రూంలు, ఒక హాలు, ఒక కిచెన్‌తో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ కానీ, బీజేపీలో కానీ ఎక్కడైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. భారతదేశంలో ఏ నగరంలో కూడా ఇంత పెద్ద ఎత్తున బస్తీల రూపురేఖలు మార్చిన దాఖలాలు లేవన్నారు. ఒకేసారి అందరికీ ఇవ్వాలని మాకు కూడా ఉన్నది. కానీ ఇన్ని కార్యక్రమాలు, మధ్యలో రెండేండ్లు కరోనాలాంటి సంక్షోభం. దానివల్ల ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతిన్నది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసుకున్నం. రైతుబంధు కింద 73వేల కోట్లు రైతుల ఖాతాలో వేస్తున్నాం. దళితబంధు వంటి విప్లవాత్మక పథకం తెచ్చి దళితోద్ధరణలో భారతదేశానికే ఆదర్శంగా నిలిచాం. పారిశ్రామికీకరణ, కొత్త పరిశ్రమలు ఆకర్షించడంలోనూ ముందున్నాం. దుండిగల్‌కు కూడా కొత్త పరిశ్రమను తీసుకురాబోతున్నాం. ఈ ప్రాంతం రూపురేఖలు తప్పకుండా మారుస్తాం. అని మంత్రి కేటీఆర్ చెప్పారు.వాళ నగర వ్యాప్తంగా 9 ప్రాంతాల్లో మేయర్ ఆధ్వర్యంలో మంత్రులు రెండో విడతగా 13,300 ఇళ్లను పం పిణీ చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 500, సికింద్రాబాద్ కంటో న్మెంట్ నియోజకవర్గానికి 300, సనత్‌నగర్ నియోజకవర్గానికి 500, కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 500 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దుండిగల్‌కు త్వరలోనే కొత్త పరిశ్రమ రాబోతోందని కేటీఆర్ తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

# గణనాథుల సన్నిధిలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** హుజురాబాద్ లోని అన్ని వార్డులలో కొలువైన గణనాథుల సన్నిధికి గురువారం రోజు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు మొదలుకొని సాయంత్రం వరకు బైకుల మీద ర్యాలీగా గణనాథుల మండపాలను సందర్శించారు. ప్రతి మంటపం వద్ద ఉన్న గణనాథునికి తన వంతు చందాగా 5,000 రూపాయలు యూత్ కి ఇచ్చారు. గురువారం ఒక్కరోజే హుజురాబాద్ మండలంలోని 100కు పైగా గణపతి మండపాలలోని గణపతి లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ లోని యువకులంతా గణనాథులను ఏర్పాటు చేయడం హర్ష నియమన్నారు. గణనాథుని కృపా కటాక్షంతో హుజురాబాద్ నియోజకవర్గం లోని ప్రజలందరూ ఆనందం, ఆరోగ్యంగా అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నారు. హుజురాబాద్ లోని హనుమాన్ టెంపుల్ వద్ద కొలువై ఉన్న గణనాథుని ప్రాంగణంలో కళ్యాణమండపం కూడా కట్టిస్తానని హామీ ఇచ్చారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పూర్తిచేసి విగ్నేశ్వరుని కృపకు పాత్రులు కావాలని అన్నారు. యువకులంతా నిమజ్జనం రోజు జాగ్రత్తలు పాటించి నిమజ్జనం నిర్వహించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని కోరారు. హుజురాబాద్ అభివృద్ధి తన బాధ్యత అని ఒక్క అవకాశం కల్పిస్తే హుజురాబాద్ రూపు రేఖలు మార్చి చూపిస్తానని అన్నారు. 1000 కోట్ల నిధులతో అత్యద్భుతంగా హుజురాబాద్ ని తన ఇంటిని కట్టుకున్న విధంగా కట్టుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్లు కేసిరెడ్డి లావణ్య నరసింహారెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ లతో పాటు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు ఎలాంటి ఇబ్బంది పడకూడదు

## రుణమాఫీ సమావేశంలో వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులకు కలక్టర్ శివలింగయ్య సూచన



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య జనగామ కలెక్టర్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్ సంబంధిత అధికారులతో రైతు రుణమాఫీల గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జిల్లాలో ప్రతి రైతు రుణమాఫీ పొందే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా వారి వారి ఖాతాలో రుణమాఫీ పడే విధంగా చూడాలని సంబంధిత అదికారులను కోరారు. ముఖ్యంగా కొద్ది మంది రైతులకు అకౌంట్లో డబ్బులు పడట్లేదు అని ఇబ్బంది పడుతున్నారని, వారియొక్క సందేహాలను రైతులు ఆయా క్లస్టర్ ఏ.ఈ.ఓ క వద్దకు వెళ్లి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. రైతులు రుణం తీసుకున్న బ్యాంకులో రైతులకు అకౌంట్ నంబర్ ఉండి ఉంటే, ఆ అకౌంట్లో డబ్బులు జమచేయబడుతాయి అని, అకౌంట్ క్లోజ్ అయినా, మారిపోయినా , ప్రభుత్వమే ఆ రైతులకు ఉన్న ఇతర అకౌంట్లలో రుణమాఫీ డబ్బులు జమచేస్తుందని, ఒకవేళ రుణ మాఫీ అయిన రైతు చనిపోతే, వారి అసలైన వారసులు బ్యాంక్ మేనేజర్ ను కలిసి సంబందిత పత్రాలు సమర్పించవలెనని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, బ్యాంక్ అధికారులు, ఎల్ డి ఎం. శ్రీధర్ ఉన్నారు.

# ఈ పార్లమెంటు సమావేశంలోనే ఎస్‌సి వర్గీకరణ బిల్లు పెట్టాలని జనగామలో మహా ధర్నా



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్.సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా అంబేద్కర్ కూడలిలో ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంఎస్పి జనగామ జిల్లా ఇన్చార్జి మేడిపల్లి శ్యామ్ మాదిగ, ఎంఎస్పి జాతీయ నాయకులు కొయ్యడ మల్లేష్ మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు ఎడవెల్లి సోమశేఖర్ మాదిగ, జనగామ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ మాదిగ, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేష్ మాదిగ, ఎంఎస్పి జనగామ జిల్లా ఇన్చార్జి గద్దల కిషోర్ మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు నిర్మల భాస్కర్ మాదిగ, డార్మిడి మండల ఇన్చార్జి గువ్వల రవి మాదిగ, ఎం ఎస్ పి దేవరుప్పుల మండలం ఇంచార్జ్ సంజన రవీందర్ మాదిగ, ఎం ఎస్ పి పాలకుర్తి మండల ఇన్చార్జి జేరిపోతుల సుధాకర్ మాదిగ, బచ్చన్నపేట ఇన్చార్జి కొంపెల్లి అంబేద్కర్ మాదిగ, తరిగొపుల ఇన్చార్జి చాడా ఏలియా మాదిగ, చిలుపూరు ఇంచార్జి నలిమెల నాగరాజు మాదిగ, స్టేషన్ ఘన్పూర్ ఇన్చార్జి గాదె శ్రీధర్ మాదిగ, జఫర్ గడ్ ఇన్చార్జి ఆరూరి శ్రీనివాస్ మాదిగ, విహెచ్పిఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు తాళ్ల పెల్లి కుమార్ మాదిగ, సీనియర్ నాయకులు మచ్చ అబ్బయ్య మాదిగ, కొడితే కుమార్ మాదిగ, అల్వాల నర్సింగరావు మాదిగ, బచ్చన్నపేట మండల నాయకులు కుమారస్వామి మాదిగ, అలవాల అనిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా నాయకులు అంత గల మధు మాదిగ, ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా నాయకులు పాలమాకుల శ్రావణ మాదిగ పాల్గొన్నారు.



జనగామ పట్టణంలోని 27 వార్డు కూరగాయల మార్కెట్ రోడ్డులో యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య మహిళలచే ఘనంగా శ్రీ లలితా పారాయణం. (ప్రజామంటలు)

# కాంగ్రెస్,బిజెపిలను నమ్మితే నట్టేట ముంచుతారు

## సంక్రాంతి ముందు వచ్చే గంగిరెద్దుల లాంటివారు
## ఎన్నికల ముందు ఇచ్చే హామీలతో మోసపోవద్దు
## కొత్తరూపాలు..కొత్త మోసాలతో వస్తున్నారు జాగ్రత్త
## దుండిగల్ సభలో ప్రజలకు మంత్రి కెటిఆర్ హెచ్చరిక

**మేడ్చెల్,సెపస్టెంబర్21:** ఢిల్లీ, బెంగళూరు నంచి వచ్చి వచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు మంత్రి కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్, బిజెపిలను నమ్ముకుంటే నమ్మేట మునుగుతారని హెచ్చరించారు. సంక్రాంతికి గంగిరెద్దు వచ్చినట్టుగా ఎన్నికల ముందు ఇష్టమొచ్చినట్టు మాటలు చెప్పే వాళ్లు వస్తున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి వాళ్ల మాటలకు మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఢిల్లీ నుంచి వచ్చిన వారి హామీలను నమ్మొద్దని అన్నారు.దుండిగల్‌లో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్,బిజెపిల తీరుపై మండిపడ్డారు. పనితో గెలవలేక.. ఇదివరకు ఏం చేసింర్రో చెప్పలేక.. కొత్త రూపాల్లో వస్తున్నారని.. ఇష్టమొచ్చిన హామీలు ఇస్తున్నారని తెలిపారు. వాళ్లు ఇచ్చి హామీలు నమ్మి మోసపోదామా అని ప్రశ్నించారు. ప్రజలు తొందరపడొద్దని.. ప్రజలు, రైతులపై కేసీఆర్ కంటే ఎక్కువ ప్రేమ ఉన్న నాయకులు భారతదేశంలో ఎవరైనా ఉన్నారా అని ఆలోచించుకోవాలని సూచించారు.వాళ్లు చెప్పినదానికంటే ఎక్కువ సంక్షేమ కార్యక్రమాలు చేయాలని కేసీఆర్‌కు కూడా ఉందని అన్నారు. తప్పకుండా వాళ్లు చెప్పినదానికంటే బ్రహ్మాండగా పేదలను ఆదుకోవాలని కేసీఆర్ ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఆ విషయాలను తొందరలోనే సీఎం కేసీఆర్ చెబుతారని పేర్కొన్నారు. కొత్తగా రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ ఈ తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో జోడెద్దుల మాదిరిగా తెలంగాణ రాష్ట్రం ప్రగతి బాటలో ముందుకెళ్తున్నదని అన్నారు. 'ఒకప్పుడు హైదరాబాద్‌లో ఏ బస్తీకి పోయినా మంచి నీళ్ల కోసం లొల్లి కనిపించేదని, ఖైరతాబాద్ జలమండలి ముందు నుంచి వెళ్దామంటే భయంగా ఉండేదన్నారు. ఎప్పుడు చూసినా ఖాళీ బిందెలు, ఖాళీ కుండలు పెట్టి ధర్నాలు చేసేవాళ్లు. కరెంటు గోస చెప్పక్కర్లేదు. అపార్ట్‌మెంట్ కిందకు వెళ్తే డీజిల్ కంపుతో ముక్కులు పగిలిపోయేవి. ఇన్వర్టర్లు, జనరేటర్లు లేకపోతే జ్యూస్ స్టాల్, జిరాక్స్ సెంటర్లు నడుపుకోలేని అవస్థ. గణేశ్ పండగ వచ్చిందంటే వారం రోజులు కర్ఫ్యూ కంపల్సరీ ఉండేవని గుర్తుచేశారు. ఇవాళ ఆ పరిస్థితులు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని.. మంచినీళ్ల సౌలత్ మంచిగైందని.. రోడ్లు బాగైనయని.. పేదలకు కడుపు నిండా పింఛన్ వస్తున్నదని.. డబుల్ బెడ్రూం ఇండ్లు వస్తున్నాయని తెలిపారు. ఇన్ని పనులు చేసుకుంటూ ముందుకు పోతున్న ఈ ప్రగతి చక్రాలను ఆపేందుకు.. వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల ముందు కొంతమంది వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై మంత్రి కేటీఆర్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. చాయ్ అమ్ముకునేవారు దేశాన్ని మోసం చేయొద్దని వ్యాఖ్యానించారు.

# 33 శాతం మహిళా రిజర్వేషన్‌లలో బీసీ, ఎస్సి, ఎస్టీలకు 93 శాతం వాటా కేటాయించాలి



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** 33 శాతం మహిళా రిజర్వేషన్ లలో 93 శాతం బీసీ, ఎస్సి, ఎస్టీలకు 93 శాతం వాటా కెటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మహిళా రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిరంజీవి మహారాజ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో 93 శాతం బిసి,ఎస్సి ఎస్టీ మహిళాలకు ఉపకోట కేటాయించాలన్నారు. ఒకవేళ ఇలా జరగకపోతే అగ్రవర్ణ దొర పొయి దొరసాని పార్లమెంటు, అసెంబ్లీలోకి ప్రవేశిస్తారని అన్నారు. దీనివల్ల బిసి,ఎస్సి,ఎస్టీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొంధకూడదని, 93 శాతం బిసి,ఎస్సి,ఎస్టీ మహిళలకు ఉపకోట 93 శాతం కల్పిస్తె ధర్మ సామాజ్ పార్టీ బిల్లుకు మద్దతు తెలుపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఉమా మహారాణి, పరశురాం మహారాజ్, కిష్టయ్య మహారాజ్,రవి మహారాజ్, కమల్ మహారాజ్ ప్రభాకర్ మహారాజ్ అనిల్ మహారాజ్ లక్ష్మణ్ మహారాజ్ ప్రశాంత్ మహారాజ్ పాల్గొన్నారు.

# తానా ప్రపంచ సాహిత్య (అంతర్జాల) మహిళా సదస్సులో ప్రత్యేక అతిథిగా బుదారపు లావణ్య



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24 న అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వివిధ 15 దేశాల మహిళామణులు పాల్గొననున్న 24 గం.ల నిర్విరామ సదస్సు "నారీ సాహిత్య భేరి" కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొనడానికి జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవియిత్రి జరసం సభ్యురాలు బుదారపు లావణ్యకి అవకాశం లభించింది. ఈ సందర్భంగా బుదారపు లావణ్య గురువారం జనగామలో మాట్లాడుతూ ఎందరో తనలాంటి ఔత్సాహిక రచయిత్రులను ప్రోత్సహిస్తూ, సాహితీ సేవలు చేస్తున్న తానా సమన్వయ కర్త చిగురుమళ్ళ శ్రీనివాస్, తానా అధ్యక్షులు శ్రీమాన్ శృంగ వరపు నిరంజన్, తానా నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో మమ్మల్ని భాగస్వాములుగా చేసిన తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వేదికపై జనగామ వాణిని వినిపించనున్న కవయిత్రి లావణ్య ను జరసం అధ్యక్షులు అయిలా సోమనర్సింహాచారి, కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శి లగిశెట్టి ప్రభాకర్, తెరసం జిల్లా అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య అభినందించారు.

# 'ఓటే వజ్రాయుధం' కళాప్రదర్శనలు



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధమని,18 నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కు పొందాలని, ఓటును నోటుకు కోటర్కు అమ్ముకోవద్దని స్వచ్ఛందంగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలని భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లొంగకుండా ప్రగతికి అడ్డుపడకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు ను ఉపయోగించుకోవాలని జనగామ జిల్లా కలెక్టర్ సారధ్యంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఈరోజు లింగాలఘనపురం మండలంలోని కుందారం గ్రామంలో తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారులు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జనగామ శంకర్, భానోత్ గణేష్, పిన్నింటి రత్నం, పన్నీరు శ్రీనివాస్, కారుపోతుల సోమయ్య, కేకే రాజు, అనపర్తి స్వప్న, బెజ్జరి చందు, సల్ల మమత, చదిరి పద్మ, సల్ల చామంతి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వివర్స్ కాలనీలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి



**జనగామ సెప్టెంబర్ 21 (ప్రజామంటలు):** జనగామ జిల్లాలోని వివర్స్ కాలనీలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11 వర్ధంతి 11, 12వ వార్డు ప్రజలు, పద్మశాలి కుల బాంధవులు చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాబుజీ సేవా సమితి సభ్యులు ఎనగందల కృష్ణ, సేవా సమితి సభ్యులు అంకం తిరుమలేష్, చేనేత కార్మికుడు భోగ సత్యనారాయణ, అంకం తిరుమలేశ్ నేత కొండ మల్లికార్జున్ నేత, చిలిరల గణేష్ నేత, కామిని ఆంజనేయులు నేత, గూడెల్లి యాదగిరి, బొమ్మెర నరసింహులు, మూడ వెంకటేష్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAG-TIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com